ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
శుక్రవారం | 22 ఆగస్టు, 2025 | పేజీలు :08

## ఆర్డిఓ పరిధిలో పలు భూ సమస్యలు పరిష్కారం



**ప్రజాపక్షం/పెద్దపల్లి :** భూ భారతి పోర్టల్ లో కొన్ని మాడ్యూల్స్ లో భూ సమస్యలు ఆర్డిఓ పరిధిలో పరిష్కారం చేయడం జరుగుతుందని, దరఖాస్తుదారులు అనవసరంగా కలెక్టరేట్ కు వచ్చి ఇబ్బంది పడవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. భూ భారతి చట్టం లోని కొన్ని మాడ్యూల్స్ లో పరిష్కారంఆర్.డి.ఓ స్థాయిలో లభిస్తుందని కలెక్టర్ తెలిపారు.వాటిలో మార్కెట్ విలువ 5 లక్షల కంటే తక్కువ ఉన్న మిస్సింగ్ సర్వే నెంబర్,భూ విస్తీర్ణ సవరణ,పట్టా పాస్ పుస్తకం డిజిటల్ సైన్,పట్టా పాస్ పుస్తకం లోని పేరు సవరణ,పెండింగ్ మ్యూటేషన్, పెండింగ్ సక్సేషన్,నాలా, కోర్ట్ కేసు పిపిబి మరియు నాల నుండి అగ్రికల్చర్ మార్చుకొనుట వంటి సమస్యలు ఆర్డిఓ కార్యాలయంలో పరిష్కారం అవుతాయని, వీటి కోసం అనవసరంగా కలెక్టరేట్ కు వచ్చి ప్రజలు ఇబ్బంది పడవద్దని కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు.

### రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలనే

# బద్నాం చేస్తున్నారు



మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్రంలో యూరియ సరఫరా పై కావాలనే రాష్ట్ర ప్రభుత్వాన్ని బద్నాం చేస్తున్నారని, రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజల్లో వస్తున్న స్పందన చూసి ఓర్వలేకనే బీఆర్ఎస్ పార్టీ బురద జల్లే కార్యక్రమం పెట్టుకుందని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మండిపడ్డారు. కరీంనగర్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రాష్ట్రంలో యూరియ సరఫరా, ఉపరాష్ట్రపతి ఎన్నికకు సంబంధించి బిఆర్ఎస్, బీజేపీ పార్టీల వైఖరిపై మంత్రి పొన్నం స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో 19 నెలల ప్రజాపాలనలో మహిళలకు ఉచిత బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500కే వంట గ్యాస్, నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు, సన్న బియ్యం, రేషన్ కార్డుల పంపిణీ, సన్నాలకు 500 బోనస్, 60 వేల ఉద్యోగాల భర్తీ, 9 రోజుల్లో 9 వేల కోట్ల రైతు భరోసా,గురుకుల విద్యార్థులకు మెస్ చార్జీల పెంపు వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రజాపాలనలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల్లో వస్తున్న స్పందన చూసి ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై బురద జల్లుతున్నారని అన్నారు. యూరియ సరఫరా బాధ్యత కేంద్రం ప్రభుత్వం ఆధీనంలో ఉంటుందని, రాష్ట్రానికి సరిపడా సప్లై చేయాలని ప్రభుత్వం తరుపున, పార్టీ తరుపున పలు మార్లు కేంద్రాన్ని కోరినట్లు తెలిపారు. యూరియ నిల్వలు సరిపడా లేవని పానిక్ క్రియేట్ చేసి రైతులను భయభ్రాంతులకు గురిచేసి బీఆర్ఎస్ పార్టీ నాయకులు రాక్షసానందం పొందుతున్నారని అన్నారు. తెలంగాణ ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో యూరియ సరఫరాపై కేంద్ర మంత్రులు స్పందించాలని, రాష్ట్రానికి రావాల్సిన యూరియను రప్పించేందుకు కృషి చేయాలని కోరారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో రైతులు నిరసనలు తెలుపుతున్నారని, కేంద్ర మంత్రి బండి సంజయ్ చొరవ తీసుకోవాలని కోరారు.ఉప రాష్ట్రపతి ఎన్నికపై స్పందిస్తూ.. న్యాయకోవిదుడు, రాజ్యాంగం పై పూర్తి స్థాయిలో అవగాహన ఉన్న తెలుగు వ్యక్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి అని అన్నారు. రాజ్యాంగంపై అవగాహన ఉన్న వ్యక్తి రాజ్యసభలో కూర్చుంటే రాజ్యాంగం పరిరక్షించబడుతుందని ఇండియా కూటమి పార్టీలు సుదర్శన్ రెడ్డిని ఎంపిక చేశాయన్నారు. బిఆర్ ఎస్ పార్టీ ఎన్డీఏ అభ్యర్థికి ఓటు వేస్తుందా... ఇండియా కూటమి అభ్యర్థికి వేస్తుందా అనేది వచ్చే నెల 9 వతేదీన తెలుస్తుందని అన్నారు. బీఆర్ ఎస్ కు బిజేపితో ఉన్నఅంతర్గత అవగాహన ఈ ఎన్నిక సందర్భంగా బయటపడుతుందన్నారు. యూరియ ఇచ్చిన వారికే ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఓటు వేస్తామనే మాట కేటీఆర్ విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు,. పదేళ్ల మంత్రిగా పని చేసిన కేటీఆర్ కు యూరియ ఎవరి ఆధీనంలో ఉంటుందో తెలియదా అని ప్రశ్నించారు.

### గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా

# జరిగేలా భద్రత ఏర్పాట్లు

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** ఈనెల 27వ తేదిన ప్రారంభం కానున్న గణేష్ ఉత్సవాలు సంబంధించిన భద్రతా ఏర్పాట్లపై జగిత్యాల జిల్లా ఎస్పీ , డీఎస్పీలతో, సిఐలతో గురువారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జగిత్యాల జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాష్ట్రంలోనే జరుపుకునే అతి పెద్ద ఉత్సవాల్లో ఒకటైన గణేష్ ఉత్సవాలు ప్రణాళిక ప్రకారం జరుగాలని ఎక్కడ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా చూడాలని అధికారులకు సూచించారు. గణేష్ విగ్రహాల ప్రతిష్టాపన విషయంలో నిర్వహకులతో ఎస్ఐలు, ఇన్స్‌ఫెక్టార్లు ముందుగానే సమావేశమై ఏర్పాట్లపై సమీక్షించాలన్నారు. సమస్యలు రానివద్దని, అందరు సమిష్టిగా కృషి చేయాలన్నారు. డయల్ 100 కు వచ్చే కాల్స్‌ను ప్రత్యేక శ్రద్ధతో పరిగణించాలన్నారు. సీసీటీవిలపై దృష్టి సారించి, విజిబుల్ పోలిసింగ్‌కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారుగణేష్ భోభయాత్రలో ఎలాంటి ఆటంకాలు తలెత్తకుండా నిర్వహించడానికి పటిష్టమైన పోలీసులతో బందోబస్తు, నిమజ్జనోత్సవానికి అవసరమైన స్విమర్లు, నిమజ్జనానికి వినియోగించే క్రేన్స్ లైటింగ్స్, సీసీ టీవి కెమెరాల ఏర్పాటు పై సంబంధిత శాఖల సమన్వయంతో నిమజ్జనాన్ని విజయవంతం చేసేందుకు ముందస్తు ప్రణాళిక సిద్దం చేయాలని సూచించారు.

**వాస్తవాలను తెలుసుకోకుండా సోషల్ మీడియాలో పోస్టులను ఫార్వర్డ్ చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం...**

సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులు శాంతిభద్రతలకు విఘాతం కలిగించు పోస్టులు పెట్టే వారిపై, వాస్తవాలను తెలుసుకోకుండా అట్టి పోస్టులను ఫార్వర్డ్ చేసే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఎస్పీ తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే పోస్టులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిజనిజాలు తెలుసుకోకుండా ఎట్టి పరిస్థితుల్లో అట్టి మేసేజ్‌లను ఫార్వర్డ్ చేయకూడదని , సోషల్ మీడియా పై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సోషల్ మీడియా విభాగం ప్రతి పోస్టును నిశితంగా పరిశీలించడం జరుగుతుందని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో విద్వేషాలు రెచ్చగొట్టే పోస్టులను వాట్సాప్ మరియు ఫేస్‌బుక్‌ల ద్వారా చేసిన వ్యక్తులపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డీఎస్పీలు రఘుచందర్, రాములు, ఎస్‌బి ఇన్స్‌ఫెక్టార్ ఆరిఫ్‌ఖాన్, సిఐలు, కరుణాకర్ పాల్గొన్నారు



### యూరియా సరఫరా చేయడంలో

# కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**ప్రజాపక్షం/ముస్తాబాద్ :** ముస్తాబాద్ మండల కేంద్రంలో సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జీ కేకే మహేందర్ రెడ్డితో కలిసి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రానికి 9.80లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయిస్తే ఇప్పటి వరకు 5.32లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చిందని అన్నారు. 2.69 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా లోటు ఉందని, సియం రేవంత్ రెడ్డి గత నెల రోజుల నుండి కేంద్రాన్ని యూరియా కేటాయింపుల పైన మాట్లాడుతున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు యూరియా సరఫరాపై లేఖల రాశారని అన్నారు. స్వయంగా కేంద్ర మంత్రిని కలిసి వచ్చారని అన్నారు. కాంగ్రెస్ ఎంపీలు పార్లమెంట్‌లో యూరియా కోసం ఆందోళన చేశారన్నారు. కేంద్రం తెలంగాణపై కక్ష సాధింపు చర్యలకు దిగుతుంటే బిఆర్ఎస్ నాయకులు సంతోషపడుతున్నారని అన్నారు. రైతులను రెచ్చగొట్టడమే ఆయనకు పనిగా పెట్టుకున్నారు.

తెలంగాణకు తగినంత యూరియాను కేటాయించాలని కేసిఆర్ ఎందుకు డిమాండ్ చేయడం లేదన్నారు. రైతులు ఎవరూ ఆందోళన వద్దని యూరియా అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లా బాల్ రెడ్డి, గజ్జల రాజు, కనమనేని చక్రధర్ రెడ్డి, తలారి నర్సయ్య, కార్యకర్తలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.



# నారాయణపూర్‌పై మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌కు లేదు

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్ గురించి మాట్లాడే అర్హత మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌కు లేదని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్ అన్నారు. ఐదేళ్లు ఎమ్మెల్యేగా ఉండి నారాయణపూర్ నిర్వాసితుల సంక్షేమాన్ని గాలికి వదిలేసిన ఘనుడు రవిశంకర్ అని దుయ్యబట్టారు. సాగునీరు అందించి పంటలు ఎండిపోకుండా కాపాడాలని కోరితే రాళ్ల వర్షం పడి పంట నష్టపోయాం అనుకోవాలని రైతులకు నిర్లక్ష్యమైన సమాధానమిచ్చిందెవరో రైతులు ఎప్పటికీ మరిపోరన్న సంగతి గుర్తుంచుకోవాలన్నారు. ఏనాడైనా సకాలంలో నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేయించిన చరిత్ర ఉందా అంటూ ఎద్దేవా చేశారు. పంటలు సాగు చేయడానికి ముందే నారాయణపూర్ రిజర్వాయర్‌కు సాగునీటిని విడుదల చేయించి



రైతులపై తమకున్న చిత్తశుద్ధిని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చాటుకున్నారని తెలిపారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ పార్టీ నారాయణపూర్ నిర్వాసితులకు న్యాయం చేయలేకపోయిందన్నారు. అబద్ధపు హామీలు పబ్బం గడుపుకోడం తప్ప చేసిందేమీ లేదన్నారు. పుట్టిన ఊరు అని చెప్పుకునే ఆయన నారాయణపూర్ గ్రామానికి ఏం చేశావో చెప్పాలన్నారు. సింగిల్ విండో వైస్ చైర్మన్ వేముల భాస్కర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుబ్బాసి బుచ్చన్న, జాగిరపు శ్రీనివాస్ రెడ్డి, బూరుగు గంగన్న, దోర్నాల శ్రీనివాస్ రెడ్డి, రోమాల రమేష్, సాగి అజయ్ రావు, వేముల అంజి, మంత్రి మహేందర్, శ్రీనివాస్ తదితరులున్నారు.

## సర్పంచుల పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

**ప్రజాపక్షం/గంగాధర:** రాష్ట్రంలోని తాజీ మాజీ సర్పంచులకు ఇవ్వాల్సిన పెండింగ్ బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి గ్రామ పంచాయతీలలో నిధులు జమ చేయాలని కోరుతూ కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గంలో ఈ నెల 24న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి మీనాక్షి నటరాజన్ పర్యటిస్తున్న సంధర్భంగా ఆమెను కలిసి తమ బాధలు చెప్పుకునే అవకాశాన్ని స్థానిక ఎమ్మెల్యే,పోలీసులు కల్పించాలని సర్పంచుల జేఏసీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జోగు సాగర్ డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాలలో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక చేసిన అప్పులు తీర్చలేక తీవ్రమైన మనోవేదనకు గురై సర్పంచులు చాలా మంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇస్తూ సర్పంచులకు ఇవ్వాల్సిన బిల్లులు ఇచ్చి వారిని ఆదుకుంటామన్నారని, ఏడాదిన్నర గడిచినప్పటికీ బిల్లులు ఇవ్వకుండా సర్పంచులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. తమ బాధలు చెప్పుకోవడానికి జిల్లాలో పర్యటిస్తున్న మీనాక్షి నటరాజన్‌కు వినతిపత్రాన్ని అందజేసి శాంతియుతంగా తమ బాధలు చెప్పుకునే అవకాశాన్ని కల్పించాలని కోరారు. ఆమెను కలిసే అవకాశం ఇవ్వకుండా ముందస్తు ఆరెస్టులు చేస్తే తమ పోరాటాన్ని ఉధృతం చేసి పర్యటిస్తున్న నాయకులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జేఏసీ రాష్ట్ర నాయకులు మాజీ సర్పంచులు మేచినేని నవీన్‌రావు, వేముల దామోదర్, శ్రీమల్ల మేఘరాజ్, ఎండి నజీరుద్దీన్, జిల్లా నాయకులు మడ్లపెల్లి గంగాధర్, రామిడి సురేందర్, సాగి మహిపాల్ రావు, పంజాల అంజన్న, వడ్లూరి ఆదిమల్లు, ముక్కెర మల్లేశం, బోల్లాడి శ్రీనివాస్ రెడ్డి, పొట్టాల కనకయ్య తదితరులున్నారు.

## కస్తూర్బా బాలికల పాఠశాలలో వైద్య శిబిరం

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలంలోని శ్రీరాములపల్లి కస్తూర్బా పాఠశాలలో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం డాక్టర్ తులసీదాస్ ఆద్వర్యంలో సీజనల్ మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ సంధర్భంగా బాలికలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అధిక వర్షపాతం నమోదవుతున్న వేళ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుందని, చికెన్ గున్యా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి వ్యాధుల గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ నీరు ఎక్కడ నిలువ లేకుండా పొడి వాతావరణంలో ఉంచాలన్నారు. మంగళవారం, శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. దోమలు పొదిగే కాలం తగ్గిపోతుందన్నారు. సీజనల్ వ్యాధులు తక్కువ అవుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కెజిబివి ప్రధానోపాధ్యాయులు సిహెచ్‌వో శ్యామల, రోజా రాణి, ఏఎన్‌ఎంలు, ఆశాలు, తదితరులున్నారు.

## తెలంగాణ సమాజంపై మార్వాడీల కత్తి

**ప్రజాపక్షం / హుజురాబాద్ :** తెలంగాణ సమాజంపై మర్వాడీలు కత్తి పెట్టారని విశ్వకర్మ సంఘం మండల అధ్యక్షుడు తాటికొండ శ్రీనివాస్ ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో విశ్వకర్మ సంఘం ఆధ్వర్యంలో విశ్వకర్మల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్వాడి వ్యాపారాలు చేసి వ్యాపారాల వల్ల విశ్వకర్మల వృత్తి పూర్తిగా దెబ్బతింటుందని మండిపడ్డారు.




మార్వాడీల విశ్వకర్మల వృత్తిని కబలిస్తున్నారని దీంతో తమ కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందన్నారు. మార్వాడీలు అన్ని రకాలు వ్యాపారాలు చేస్తూ నాణ్యత లేని నాసిరకం వస్తువులు విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో ఈ ప్రాంత వ్యాపారాలు క్షీణించడానికి కారకులవుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్వాడీల గోబ్యాక్ ఉద్యమానికి ఓయూ జేఏసి ఆధ్వర్యంలో శుక్రవారం ఇచ్చిన రాష్ట్ర బంద్‌కు విశ్వకర్మల సంపూర్ణ మద్దతు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వకర్మ సంఘం నాయకులు నందగిరి శ్రీనివాస్, రాంపల్లి భిక్షపతి, రావుల వేణు, వేమునూరి శ్రీనివాస్, చల్లూరి రఘు, బాణాల సత్యం, నందాచారి, భిక్షపతి, పంచకోటి సత్యనారాయణ, బండ్లోజు లింగమూర్తి, రాంపల్లి రాజ్ కుమార్, నాంపల్లి మహేందర్, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

## నీటిని విడుదల చేసి రైతును ఆదుకోవాలి

**ప్రజాపక్షం/గంగాధర:** ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ఎత్తిపోతల ద్వారా గంగాధర మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్‌కు నీటిని విడుదల చేస్తే 1.50 లక్షల ఎకరాల సాగునీరు అందించవచ్చని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర మండలం నారాయణపూర్ రిజర్వాయర్‌ను గురువారం స్థానిక బిఆర్ఎస్ నాయకులు, రైతులతో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. లక్షలాది క్యూసెక్కుల నీళ్లు వృధాగా పోతున్నా నీటిని ఒడిసిపట్టి ఎల్లంపల్లి ప్రాజెక్టు పంపుల ద్వారా నీటిని ఎత్తిపోసేందుకు అవకాశమున్నా ఎందుకు విడుదల చేస్తలేరో చెప్పాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రెండు పంపులు ఆన్ చేస్తే రిజర్వాయర్ మూడు నాలుగు రోజుల్లోనే నింపుకోవచ్చని, తద్వారా ఎల్లంపల్లి ప్రాజెక్టు పరిధిలో మొత్తం 1.50 లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా నారాయణపూర్ రిజర్వాయర్ ఈ ప్రాజెక్టుకు కీలకంగా ఉందన్నారు. దీని ద్వారా కరీంనగర్ జిల్లా పరిధిలోని గంగాధర, చొప్పదండి, రామడుగు, జగిత్యాల జిల్లా పరిధిలోని కొడిమ్యాల, మల్యాల, మేడిపల్లి, కథ



లాపూర్, , రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలోని వేములవాడ, బోయినిపల్లి తదితర మండలాల పరిధిలోని వేలాది ఎకరాలకు నీళ్లు అందివ్వచ్చన్నారు. తక్షణమే నారాయణపూర్ రిజర్వాయర్ నింపి రైతులకు నీళ్లు అందించాలని, లేని పక్షంలో రైతుల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మేచినేని నవీన్‌రావు, నాయకులు ఆకుల మధుసూధన్, మడ్లపెల్లి గంగాధర్, జోగు లక్ష్మిరాజం (సాగర్), సాగి మహిపాల్ రావు, ఉప్పు గంగన్న, వంగల మల్లిఖార్జున్, కోల లింగారెడ్డి, రైతులు, పాల్గొన్నారు.

## పార్కు సుందరీకరణ పనులను పూర్తి చేయాలి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** కరీంనగర్‌లోని పద్మానగర్ పార్కు సుందరీకరణ పనులను పూర్తి చేసేలా ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ అన్నారు. కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధిలో భాగంగా గురువారం నగరంలోని పద్మానగర్, కట్టరాంపూర్ ప్రాంతంలో ఇంజనీరింగ్, సానిటేషన్ అధికారులతో కలిసి పర్యటించారు.



మొదటగా నగరంలోని పద్మానగర్ చౌరస్తాను సందర్శించి బుల్ సెమెన్ సెంటర్ వైపు నగరపాలక సంస్థ ద్వారా నిర్మాణం చేస్తున్న డ్రైనేజ్, ప్రహారీగోడ నిర్మాణం పనులను తనిఖీ చేశారు. పద్మానగర్ చౌరస్తాలో ప్రమాదకరంగా మారిన రోడ్డును పరిశీలించారు. మరో వైపు పద్మానగర్ పార్కుతో పాటు పట్టణ ప్రకృతి వనంను సందర్శించారు. పార్కులో అభివృద్ధి పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేసి సుందరీకరణ పనులను తనిఖీ చేసారు. పట్టణ ప్రకృతి వనంలో మొక్కల సంరక్షణ చర్యలను పరిశీలించారు. పార్కు అభివృద్ధి పనులపై ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం కట్టరాంపూర్‌లోని గౌతమినగర్‌లోని స్మార్ట్ రోడ్డులో గల అసంపూర్తి డ్రైనేజీ పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పద్మానగర్ చౌరస్తాలోని రోడ్డులో ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఈఈలు యాదగిరి, సంజీవ్ కుమార్, డీఈ శ్రీనివాస్, లచ్చిరెడ్డి, సానిటేషన్ సూపర్‌వైజర్ శ్యామ్, వెటర్నరీ ఆఫీసర్ తదితరులున్నారు.

## ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం సంధర్భంగా జాతీయ న్యాయ సేవ అధికార సంస్థల ఆదేశాలకు అనుగుణంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వెంకటేష్ ఆద్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ వయోవృద్దుల ఆశ్రమంలో ప్రపంచ వయోవృద్దుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సంధర్భంగా సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ సాధారణ మనుషులతో పాటు వయోవృద్దులకు చట్టం హక్కులను కల్పించిందని, వృద్ధాప్యంలో వృద్దులను నిరాధారణకు గురి చేస్తే కఠినమైన చట్టాలున్నాయని తెలిపారు. ఈ సంధర్భంగా ఆశ్రమంలోని వృద్దులకు పండ్లు పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని స్వాధార్ హోంను సందర్శించి బాధితులతో ముచ్చటించారు. ఎటువంటి న్యాయ సహాయానికైనా జిల్లా న్యాయ సేవ అధికార సంస్థను సంప్రదించాలని కోరారు.



## ఇంటి నిర్మాణంపై డిఎల్‌పివో విచారణ

**ప్రజాపక్షం/శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని కరీంపేట గ్రామంలో గురువారం ఇంటి నిర్మాణంపై హుజురాబాద్ డిఎల్‌పివో విచారణ చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం వెనుక భాగంలో కరీంపేట గ్రామానికి చెందిన వనపర్తి ఐలయ్య అనే వ్యక్తి ఇంటి నిర్మాణం చేస్తుండగా గ్రామపంచాయతీ స్థలం ఆక్రమించాడని వనపర్తి హరీష్ అనే వ్యక్తి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు హుజురాబాద్ డిఎల్‌పివోను కలెక్టర్ విచారణకు ఆదేశించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదు దారుడు హరీష్‌తో పాటు గృహ నిర్మాణం చేపడుతున్న వనపర్తి ఐలయ్య వాంగ్మూలాలు తీసుకున్నారు. అనంతరం వారు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కాగా గతంలో ఉన్న పునాది కాకుండా వేరే చోట ముగ్గు పోయించడంతో ఇరువర్గాల మధ్య వివాదం రాజుకుంది. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని డిఎల్‌పివో శ్రీనివాస్ పేర్కొన్నారు. డిఎల్‌పివో వెంట ఎంపివో ప్రభాకర్, మాజీ ఎంపిటిసిలు అనిల్, తిరుపతి, మాజీ సర్పంచ్ వనపర్తి మల్లయ్య, మాజీ వార్డు సభ్యులు, గ్రామస్తులున్నారు.

## గణేష్ మండపానికి ఆన్‌లైన్ అనుమతి తప్పనిసరి

**ప్రజాపక్షం/గంగాధర:** గంగాధర మండలంలోని గ్రామాలలో గణేష్ మండపాలు, విగ్రహాల ఏర్పాటు, ఊరేగింపులకు ఉత్సవ నిర్వాహకులు అనుమతి కోసం పోలీసు శాఖ రూపొందించిన వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకోవాలని గంగాధర ఎస్సై బి.వంశీకృష్ణ తెలిపారు. భద్రతా కారణాల దృష్ట్యా http//policeportal.tspolice.gov.in/index.htm వెబ్‌సైట్‌లో మాత్రమే ధరఖాస్తులు స్వీకరించబడతాయని, పోలీస్ శాఖ ఆన్‌లైన్ ద్వారానే అనుమతులు మంజూరు చేస్తుందన్నారు. ఆన్‌లైన్‌లో పొందుపరిచిన అప్లికేషన్‌ను పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని, అనంతరం వినాయక మండపాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖ రూపొందించిన గణేష్ మండపం నిర్వహణకు సంబంధించిన ఆన్‌లైన్ ఇన్ఫర్మేషన్ అనేది కేవలం మండపం నిర్వహణ, మండపాలకు సంబంధించిన సమాచారం కోసం మాత్రమే రూపొందించిందన్నారు. ఈ సమాచారం ద్వారా భద్రత, బందోస్తు ఏర్పాటు చేయడానికి పోలీసు వారికి సులువుగా ఉంటుందని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ముందస్తు సమాచారం ఇవ్వాలన్నారు. సామాజిక మాద్యమాలలో వచ్చే ఎలాంటి అసత్య ప్రచారాలను నమ్మకూడదన్నారు.

## తీజ్ ఉత్సవాల్లో అద్దంకి దయాకర్

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** మండల కేంద్రంలోని బంజార సేవాలాల్ సంఘం ఆధ్వర్యంలో గురువారం తీజ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఇంచార్జ్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ పాల్గొని మాట్లాడారు. బంజారా లంబాడీ సంస్కృతిని చాటి చెప్పే గొప్ప పండుగ తీజ్ అని అన్నారు. వారి వెంట సిరిసిల్ల నియోజకవర్గ ఇంచార్జ్ కేకే మహేందర్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబేరా బేగం గౌస్, మండల కాంగ్రెస్ నాయకులు లక్క్మారెడ్డి, బాల్‌రెడ్డి, బంజారా సేవాలాల్ నాయకులు కిరణ్ నాయక్ పాల్గొన్నారు.

# ప్రేక్షకుల హృదయాల్లో మెగాస్టార్ చిరంజీవిది చెరగని ముద్ర



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** సుధీర్ఘకాలం పాటు వెండితెరపై విలక్షణమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో మెగాస్టార్ చిరంజీవి చెరగని ముద్ర వేసుకున్నారని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మెగాస్టార్ చిరంజీవి మరిన్ని మంచి సినిమాలు తీస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. మెగాస్టార్‌కు మరింత మంచిపేరు వస్తుందని తెలిపారు. మెగాస్టార్ చిరంజీవి 70వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం హైదరాబాదులో జరిగే వేడుకలకు కరీంనగర్ జిల్లా నుంచి చిరంజీవి యువత తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు వేల్పుల వెంకటేష్ ఆధ్వర్యంలో 400 మంది మెగా అభిమానులు తరలివెళ్లారు. వాహనాల ర్యాలీని కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండలంలో దేవక్కపల్లిలో వెలిచాల రాజేందర్ రావు జెండా ఊపి ప్రారంభించారు. ఆయనతో ప్రత్యేక ఆత్మీయత అనుబంధం ఉందన్నారు. తమ కుటుంబానికి అత్యంత ఆప్తుడు అని, గతంలో తమ ఇంట్లో కరీంనగర్‌లో ఐదు రోజుల పాటు ఉన్నారని గుర్తు చేశారు. చిరంజీవితో అనుబంధం ఉండడం అదృష్టం అన్నారు. ఈ సంధర్భంగా వేల్పుల వెంకటేష్‌ను రాజేందర్ అభినందించారు. కార్యక్రమంలో ఆకుల నర్సన్న, ఆకుల ఉదయ్, బట్టు వరప్రసాద్ తదితరులున్నారు.

## 25న కలెక్టరేట్ ముట్టడి

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండంల కేంద్రంలోని భవన నిర్మాణ కార్మికలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 25న కలెక్టరేట్ ముందు ధర్నా కార్యక్రమం చేపడుతున్నట్టు సిఐటీయూ నాయకులు తెలిపారు. మండల కమిటీ అధ్యక్షులు భూక్య వెంకట్, జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మండల కేంద్రంలో గురువారం సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ ఉపాధ్యాక్షులు గుంటుకు నరేందర్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంకు సంబంధించిన ఇసుక, మొరం, మట్టి కొరత, నిర్మాణ మెటీరియల్ ధరలు విపరీతంగా పెరిగి, నిర్మాణ రంగంలో పనిచేస్తున్న కార్మికులు కూడా చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అదేవిధంగా భవన నిర్మాణ వెల్ఫేర్ బోర్డులోని స్కీములను ప్రభుత్వం ప్రైవేట్ ఇన్సూరెన్స్ కంపెనీలకు కట్ట పెట్టే ప్రయత్నం చేస్తుందని దీనివలన భవన నిర్మాణం మరియు ఇతర నిర్మాణ రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఇట్టి సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు భూసరాజం, శంకర్, కార్మికులు పాల్గొన్నారు.

## ఘనంగా తీజ్ ఉత్సవాలు...

**ప్రజాపక్షం/వీర్నపల్లి:** మండల కేంద్రంలోని సీతారాం నాయక్ తండా గ్రామంలో గురువారం తీజ్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారా, లంబాడీ సంస్కృతి, సాంప్రదాయలను చాటే గోప్ప పండుగలలో తీజ్ అతి ముఖ్యమైనదని వారు తెలిపారు. తీజ్ అనగా గోదుమ మొలకలు అని అర్థం, ఈ పండుగను పెళ్ళి కాని అమ్మాయిలు శ్రావణమాసములో అత్యంత భక్తి శ్రద్ధలతో తొమ్మిది రోజుల పాటు వైభవంగా జరుపుకుంటారని, బంజార యువతులు తీజ ఎత్తుకొని సాంప్రదాయ పద్దతులలో నృత్యాలు చేస్తూ తమ సంస్కృతిని భావితరాలకు అందించే విధంగా పండుగని నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సంతోష్ నాయక్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు భూక్యా మహిపాల్, బిజెపి గ్రామ శాఖ అధ్యక్షులు గజన్, పాల్గొన్నారు.

## 60 వేల ఉద్యోగాలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

**ప్రజాపక్షం/జగిత్యాలః** నిరుద్యోగుల పాలిట పాపపు పార్టీ కాంగ్రెస్ పార్టీ అని జగిత్యాల జిల్లా మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంతసురేష్ అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలో బుధవారం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్ అబద్దపు హామీలు అసత్య ప్రచారాలు చేసి తెలంగాణ ప్రజలను భ్రమలో పెట్టిందన్నారు. 60 వేల ఉద్యోగాలు ప్రకటించామని చెబుతున్న ప్రభుత్వం నోటిఫికేషన్ పరీక్షలు, ఫలితాలపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు.

## యూరియా సరఫరాల కేంద్ర ప్రభుత్వం వివక్ష తగదు



**ప్రజాపక్షం/జమ్మికుంట:** ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు గడుస్తున్నప్పటికీ తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాల్సిన యూరియాను సరఫరా చేయకుండా కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపించడం తగదని జమ్మికుంట మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంబాల రాజు పేర్కొన్నారు. తెలంగాణకు 90 వేల మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేయాల్సింది పోయి 40 వేల మెట్రిక్ టన్నులు కేటాయించడం రైతులను ఇబ్బంది పెట్టడమేనన్నారు. రాష్ట్రంలో సీఎం, వ్యవసాయ శాఖమంత్రి కేంద్రానికి అవసరమైన యూరియా సరఫరాకు నివేదించినప్పటికీ కావాలనే తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపిస్తోందన్నారు. తెలంగాణ నుంచి 8 మంది పార్లమెంటు సభ్యులుండి, ఇద్దరు కేంద్ర మంత్రులున్నా రైతులు పడుతున్న ఇబ్బందులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. వెంటనే కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తగిన యూరియాను సరఫరా చేయించి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు. లేని పక్షంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

## గిరిజనుల సంస్కృతి, సంప్రాదాయాలకు ప్రతీక



**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** తీజ్ పండుగ ఎంతో విశిష్టమైనదని, గిరిజనుల సంస్కృతికి సంప్రదాయాలకు ప్రతీక తీజ్ పండుగ అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం కరీంనగర్‌లోని కోతిరాంపూర్‌లో జరిగిన తీజ్ ఉత్సవాలకు రాజేందర్ రావు ముఖ్య అతిధిగా హాజరయ్యారు. అందులో భాగంగా సేవాలాల్ మహరాజ్ జగదాంబ మాతకు రాజేందర్‌రావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సంధర్భంగా గిరిజన సంఘాల ప్రతినిధులు, మహిళలు రాజేందర్‌రావుకు తలపాగా చుట్టి ఘనంగా సన్మానించారు. సాంప్రదాయబద్దంగా గోధుమ మొక్కల బుట్టను బంజారా మహిళలు రాజేందర్‌రావు తలపై పెట్టారు. వారితో కలిసి ఆయన నృత్యం చేశారు. వారందరికీ తీజ్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తీజ్ పండుగ సంధర్భంగా గోధుమలు నాటడం అనాదిగా ఆచారం ఉన్నదని, గోదుమ మొలకలు చక్కగా మొలిస్తే యువతకులకు మంచి భవిష్యత్తు ఉంటుందని నాటి నుంచి ఒక నమ్మకమని పేర్కొన్నారు. అదేవిధంగా గిరిజనులు పాడిపంటలు వ్యవసాయం, వ్యాపార రంగంలో చక్కగా రాణిస్తారనే నమ్మకం, ఆచారం అనేక ఏళ్ల నుంచి కొనసాగుతుందన్నారు. గిరిజనులు పాడిపంటలు, వ్యవసాయంలో చక్కగా రాణించి మరింత ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. గిరిజనుల సంక్షేమానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కోతిరాంపూర్‌లో నేనున్నా మీ కోసం అనే నినాదంతో వెలిచాల రాజేందర్ రావు పలు వీధుల్లో పర్యటించారు. ఈ సంధర్భంగా స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ కార్పోరేటర్ పడిశెట్టి భూమయ్య, ఆకుల ప్రసన్న, కన్నయ్య గౌడ్, బట్టు వరప్రసాద్, అనంతుల రమేష్ తదితరులున్నారు.

## గణేష్ నవరాత్రులను శాంతియుతంగా భద్రతతో నిర్వహించాలి

**ప్రజాపక్షం/కరీంనగర్:** కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులు , ప్రజలు గణేష్ నవరాత్రులను ప్రశాంతంగా సురక్షితంగా జరుపుకోవాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం సూచించారు. ఈ సంధర్భంగా పోలీసు శాఖ తరపున ఆయన పలు మార్గదర్శకాలను జారీ చేశారు. గణేష్ మండపాలను ఏర్పాటు చేసేవారు తప్పనిసరిగా పోలీసు అనుమతి కోసం ధరఖాస్తు చేసుకోవాలన్నారు. గణేష్ ప్రతిమ ఎత్తు, మండపం ఏర్పాటు చేసే స్థలం, నిమజ్జనం తేదీ, నిమజ్జన ప్రదేశం వంటి వివరాలను తెలంగాణ పోలీస్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలన్నారు. ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకున్న తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులు అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. అనుమతి పత్రం , కూ ఆర్ కోడ పోలీస్ సూచనలను మండపం వద్ద స్పష్టంగా ప్రదర్శించాలన్నారు. మండపాలకు విద్యుత్ కనెక్షన్ల విద్యుత్‌శాఖ అనుమతితోనే తీసుకోవాలని, ప్రమాదాలు జరగకుండా నాణ్యతగల వైర్లు వాడాలని సూచించారు. అగ్నిప్రమాదాలు నివారించడానికి నీటి బకెట్లు, ఇసుక బస్తాలు సిద్ధంగా ఉంచాలన్నారు. శబ్ద కాలుష్యం నివారించడానికి కేవలం రెండు స్పీకర్లు మాత్రమే వాడాలని, వృద్దులు, విధ్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరిమిత శబ్దంతో పాటలు పెట్టాలన్నారు. మండపం వద్ద 24 గంటలు ఒక వాలంటీర్ తప్పనిసరిగా ఉండాలని, కమిటీ సభ్యుల పేర్లు, ఫోన్ నెంబర్లు స్పష్టంగా కనిపించేలా ఫ్లెక్సీ ఏర్పాటు చేయాలన్నారు. మండపాల వద్ద మద్యం సేవించడం, పేకాట ఆడటం, లక్కీడ్రాలు నిర్వహించడం, అసభ్యకర నృత్యాలు చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. మత సామరస్యాన్ని దెబ్బతీసేలా ప్రసంగాలు, పాటలు ప్రదర్శించకూడదన్నారు. పోలీసు తనిఖీల కోసం మండపం వద్ద ఒక పాయింట్ పుస్తకం తప్పనిసరిగా ఉంచాలన్నారు. అనుమానాస్పత బ్యాగులు, వస్తువులు, వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100, స్థానిక పోలీస్ స్టేషన్‌కు సమాచారమివ్వాలన్నారు. నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

## పురుగుమందుల వాడకంలో జాగ్రత్తలపై అవగాహన

**ప్రజాపక్షం/ఇల్లందకుంట:** ఇల్లందకుంట మండలంలోని పాతర్లపెల్లి గ్రామంలో ప్రపంచ వన్యప్రాణి సంరక్షణ నిధి నవక్రాంతి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (బిసిఐ) ఉత్తమ పత్తి యాజమాన్య పథకం ఆద్వర్యంలో గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సంధర్భగా బిసిఐ ప్రాజెక్టు అసిస్టెంట్ పియూ మేనేజర్ మల్లేష్, ఫీల్డ్ ఫెసిలిటర్ పెద్ది గణేష్ మాట్లాడుతూ సహజ వనరులు, సమగ్ర సస్యరక్షణ పురుగు మందుల కొనుగోలు వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతుల తమ పత్తి చేన్లలో అంతర, రక్షక, ఎర పంటలు సాగు చేస్తూ పంట వైవిద్యాన్ని పాటించాలని, సరైన పోషకాలు, సమయం, ప్రదేశం, మోతాదులో వాడుకోవాలన్నారు. దుక్కి దున్నటం తగ్గించాలని, పశువుల పెంట, చెరువు మట్టి బయో ఫెర్టిలైజర్స్ వినియోగించి భూసారం పెంచుకోవాలన్నారు. బిసిఐ ఫీల్డ్ ఫెసిలిటేటర్స్ మోహన్, రమేష్, వెంకటేష్, సౌజన్యతో పాటు తదితరులున్నారు.

## మాల ధారణ స్వాములకు భిక్ష నిర్వహించిన దంపతులకు సత్కారం

**ప్రజాపక్షం/జమ్మికుంట:** పంచముఖ హనుమాన్ దేవాలయంలో గత సంవత్సరం మాదిరిగానే ఈ యేడాది అతి ముఖ్యమైన శ్రావణ మాసంలో హనుమాన్ స్వాముల మాలధారణ స్వాములకు 21 రోజుల అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించిన హిందూ ధర్మపరిరక్షణకై కృషి చేస్తూ అనేక సేవలు చేస్తున్న పొనగంటి మమతా రవికుమార్‌లకు హనుమాన్ మాలధారణ స్వాములు గురువారం సత్కరించారు. సమాజానికి ఇంకా ఎంతో సేవ చేయాలని , భగవంతుడు ఆశీస్సులు వారి కుటుంబాలపై ఉంటాయని స్వాములు పేర్కొన్నారు.

## గంగాధర తహసీల్దార్ బదిలీ

**ప్రజాపక్షం/గంగాధర:** కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి ఉత్తర్వుల మేరకు గంగాధర మండల తహసీల్దార్ ఆకస్మిక బదిలీ అయ్యారు. గంగాధర తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న జె.అనుపమరావును వీణవంక మండలానికి బదిలీ చేస్తూ బుధవారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా అదే సమయంలో వీణవంక మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎ.రజితను గంగాధర మండలానికి బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

## నిరుపేదలకు సహాయపడటమే మానవత్వం

**ప్రజాపక్షం/ముత్తారం :** సమృద్ధి కలిగిన వారు లేనివారికి సహాయపడటమే మానవత్వమని ఆలయ ఫౌండేషన్ ముఖ్య సభ్యులు కీర్తి నాగార్జున అన్నారు.పెద్దపెల్లి జిల్లా ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామానికి చెందిన పార్శ లక్ష్మి కి కొన్ని సంవత్సరాల క్రితం ప్రమాదవశాత్తు ఎడమ కాలు కోల్పోయింది. ఈ విషయాన్ని నాగార్జున ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి కి ఈ విషయాన్ని తెలుపగా స్పందించిన ఆయన హైదరాబాద్ లోని భగవాన్ మహావీర్ వికలాంగ్ సమస్థాన వారి సహకారంతో బుధవారం కృత్రిమ కాలును ఉచితంగా పెట్టించారు. మానవతా దృక్పథంతో ఈ సహాయం చేసిన ఆలయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ఐఏఎస్ అధికారి పి. నరహరి కి పార్శ లక్ష్మి , వారి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. నిస్సహాయకులు, పేదవారికి ఎన్నో సేవా కార్యక్రమాలను ఆలయ ఫౌండేషన్ ద్వారా అందిస్తుందన్నారు.

## నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాపక్షం/కొడిమ్యాల:** జగిత్యాల జిల్లా కొడిమ్యాల పట్టణంలో ముదిరాజ్ సంఘం మొదటి సంఘం సభ్యులు గురువారం రోజున నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా బల్ల చిన్న అంజయ్య ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ సంఘం అంటే ఒక ఆలోచన, అవగాహన సిద్దాంతమని, సంఘం చైతన్యం, ఒక కుటుంబం, సాయం దైర్యం, ఒక ఆత్మవిశ్వాస మని అందరికి అందుబాటులో ఉంటూ శాయశక్తుల సంఘ అభివృద్ధికి తోడ్పాడుతానని పేర్కోన్నారు. సంఘం ప్రచార కార్యదర్శిగా చొక్కాల అంజయ్య, కార్యవర్గ సభ్యులుగా చొక్కల రాజేశం, చొక్కాల రాయమల్లు, బైరి సూరి, చొక్కల నాగార్జున ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పాల్గొన్నారు.

# వేములవాడలో నేడు మెగా ఉచిత వైద్య శిబిరం

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో ప్రెస్ క్లబ్, మెడికవర్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతున్నట్లు టీయూడబ్ల్యూజే హెచ్–143 వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ తెలిపారు. ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే హెచ్143 రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ప్రెస్ అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, రాష్ట్ర ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మారుతి సాగర్ ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మహమ్మద్ రఫీ మాట్లాడుతూ ఈ మెగా వైద్య శిబిరం వేములవాడ రెండవ బైపాస్ రోడ్డులోని మహాలింగేశ్వర గార్డెన్‌లో ఉదయం 9.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగనుందని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు, పట్టణ




ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మహమ్మద్ రఫీ కోరారు. ప్రస్తుతం ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్య పరీక్షలకు అధిక ఖర్చు అవుతుందని, ఈ శిబిరం ద్వారా పేద, మధ్య తరగతి ప్రజలకు పెద్ద ఎత్తున లాభం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు. అందరూ ఈ క్యాంపులో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## కోమటి కొండాపూర్ గ్రామానికి బస్సు నడపాలని డిపో మేనేజర్‌కు వినతి

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలంలోని కోమటి కొండాపూర్ గ్రామానికి ఇబ్రహీంపట్నం మీదుగా బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ మెట్‌పల్లి డిపో మేనేజర్ దేవరాజుకు యోగేశ్వర గ్రామ సమైక్య అధ్యక్షురాలు బక్కూరి రాధిక ఆధ్వర్యంలో 50 మంది మహిళలు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోమటి కొండాపూర్ గ్రామానికి బస్సు రాకపోవడంతో మహిళలు, గ్రామస్థులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించి గ్రామస్థుల ఇబ్బందులు తొలగించాలని డిపో మేనేజర్‌కు ఇచ్చిన వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సమైక్య సంఘం కార్యదర్శి ఎడ్ల లక్ష్మి, కోశాధికారి బన్న ప్రియాంక, రెడ్డవేన లావణ్య, కాంగ్రెస్ నాయకులు దూదిగామ గంగాధర్, రెడ్డవేన రాజు, మహిళా సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ అవార్డు గ్రహీతకు సన్మానం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** ఇబ్రహీంపట్నం తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐగా పనిచేస్తున్న రమేష్‌కు ఉత్తమ అవార్డును ఈ నెల 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ చేతుల మీదుగా ఉత్తమ ఉద్యోగ ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. కాగా గురువారం ఇబ్రహీంపట్నం తహశీల్దార్ కార్యాలయంలో మాజీ ఎంపిపి నేరేళ్ల దేవేందర్ రమేష్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయనతో పాటు తహశీల్దార్ వరప్రసాద్, మాజీ జెడ్పిటిసి కొక్కుపురుషోత్తం, రామ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా రాష్ట్ర సహాయ కార్యదర్శిగా ఆకుల మల్లికార్జున్

**ప్రజాపక్షం/కోరుట్ల:** జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ రణం వార్తా దినపత్రిక ఎడిటర్ ఆకుల మల్లికార్జున్ వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమితులయ్యారు.మల్లికార్జున్‌ను రాష్ట్ర సహాయ కార్యదర్శిగా నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు రానా ప్రతాప్ రజ్జు భయ్యా నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత్రికేయులు ఎదుర్కొంటున్న సమస్యలు తీర్చడంలో ముందు నిలుస్తనని , జర్నలిస్టల సమస్యలపై గళమెత్తుతనని అన్నారు. తాన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షులకి, రాష్ట్ర నాయకులకి, తోటి పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. మల్లికార్జున్ నియామకం పట్ల పలువురు జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

## అభ్యసన సామర్థ్యాల సాధనకు బోధన ఉపకరణాలు ఉపయుక్తం

**ప్రజాపక్షం/జగిత్యాలటౌన్:** విద్యార్థులలో కనీస అభ్యసన సామర్థ్యాలు సాధించడానికి బోధన ఉపకరణాలు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని తహసీల్దార్ తిరుపతి, ఎంపీడీవో అఫ్జల్‌మియా, ఎఈవో వెంకటేశ్వర్లు అభిప్రాయపడ్డారు. గురువారం జగిత్యాల జిల్లా బుగ్గారం



మండలం ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి బోధనాభ్యసన సామాగ్రి మేళ ఘనంగా నిర్వహించారు ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు తయారుచేసిన ప్రతి టిఎల్ఎంను పరిశీలించి తరగతి గదిలో వాటిని ఎలా ఉపయోగిస్తారని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని అన్ని ప్రాథమిక ప్రాథకోన్నతపాఠశాలల నుండి ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు బోధనపకరణాలను ఆకట్టుకునేలా తయారు చేశారని అభినందించారు. అభ్యసన సామర్థ్యాల సాధనలో ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల యొక్క కృషి వెలకట్టలేనిదని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మోహన్ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధుకర్‌రావు, రాజశేఖర్, ప్రవీణ్‌కుమార్, సిఆర్‌పి పురుషోత్తం, ఎంఐఎస్ రాజేష్, సిసివో హరిత, ఐఈఆర్పి సమత, వివిధ పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నమని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డి లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలను సర్పంచులుగా ఎంపీటీసీలుగా జడ్పిటిసిలుగా గెలిపించే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. యూరియా పై కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలనే బదనాం చేస్తున్నారని మండిపడ్డారు. 10 సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీస సోయి లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. యూరియా సరఫరా కేంద్రం పరిధిలోకి వస్తుందని కేటీఆర్ బిజెపి పై ఎలాంటి ఆరోపణలు చేయకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని బధనం చేస్తున్నారని నిన్న కేటీఆర్ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికే సపోర్ట్ చేస్తా అన్న చెందాన మాట్లాడారని తెలిపారు.అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయ చైతన్యానికి ప్రతీక అని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల పట్టణ అధ్యక్షులు చొప్పదండి ప్రకాష్, సంగీతం శ్రీనివాస్, వెలుముల స్వరూప, వనిత, గడ్డం నరసయ్య, సూర దేవరాజు, బాలరాజు, జగన్మోహన్ రెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ జె టోనీ, చందన, వివిధ మండలాల అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పోషణ వాటికల ఏర్పాటుతో భోజనంలో పోషక సమృద్ధి

**ప్రజాపక్షం/జగిత్యాల రూరల్ :** పోషక తోటల నిర్వహణ పై శిక్షణ జగిత్యాల జిల్లాలో పోషణ వాటిక కొరకు 107 అంగన్వాడి కేంద్రాల్లో ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయని జగిత్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేశ్ తెలిపారు. జిల్లా సంక్షేమ శాఖ అధికారి మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలోని 1065 అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు బాలింతలు మూడు



నుంచి ఆరు సంవత్సరాల లోపు పిల్లలకు ఇచ్చే ఒక పూట భోజనంలో పోషక సమృద్ధి చేయాలనే ఉద్దేశంతో జగిత్యాల జిల్లాలో మొదటగా 107 అంగన్వాడి కేంద్రాల్లో పోషన వాటికలు నిర్మించి వాటిలో పండించిన కూరగాయలతో హాజరవుతున్న హక్కుదారులకు ఒక్కపూట భోజనాన్ని ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో పోషణ వాటికలు నిర్మించాలని కమిషనర్ ఇచ్చిన ఉత్తర్వులు మేరకు గురువారం జగిత్యాల రూరల్ మండలంలోని వంజరిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో జగిత్యాల జిల్లాలోని సూపర్వైజర్లకు, సిడిపిఓలకు జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేశ్ ఆధ్వర్యంలో శ్యాం ప్రసాద్, స్వాతి జిల్లా ఉద్యానవన శాఖ అధికారులు విచ్చేసి ఈ కేంద్రంలో సూపర్వైజర్ అందరికి పోషణ వాటిక సంబంధించిన నేల చదును, ఎరువులు ఎలా తయారు చేసుకోవాలి. దానికి సంబంధించిన దుక్కిన ఎలా ఎంత లోతు తవ్వుకోవాలి దాన్ని ఎలా నేర్పాలి అందులో అడుగు మందుతో పాటు పశువుల పేట తర్వాత వర్మి కంపోస్టు కోకోపీట్ ఏ రకంగా కలపాలి ఎంత ఎత్తులో మొదలు తయారు చేసుకోవాలి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సూపర్వైజర్ అందరికి జిల్లాలోని మంజూరు కాబడిన అన్ని పోషణ వాటికల్లో ఈ విధంగా పోషణ వాటిక ఏర్పాటు చేసి ప్రతి మండల కేంద్రంలో పోషణ వాటిక ఏర్పాటు చేయడానికి ప్రతి మండల కేంద్రంలో సూపర్వైజర్లు గుర్తించబడిన అంగన్వాడీ కేంద్రాల టీచర్లతో ఈ రకంగా ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చి వారంలో ఏర్పాటు చేయాలని జగిత్యాల జిల్లా సంక్షేమ శాఖ అధికారి నరేశ్ సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లాలోని సిడిపివోలు, సూపర్వైజర్లు ఎఫ్.ఆర్.వో, తదితరులు పాల్గొన్నారు.

## మినీ వాటర్ ప్లాంట్ వితరణ

**ప్రజాపక్షం/ముస్తాబాద్:** ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో పూర్వ విద్యార్థులు 1982–83 పదవ తరగతి బ్యాచ్ ఆవునూరు ప్రాథమిక పాఠశాలలో మంచి నీటి సౌకర్యార్థం పిల్లల దాహం తీర్చే దిశగా 40వేల రూ.లు వెచ్చించి మిని వాటర్ ప్లాంట్‌ను పూర్వ విద్యార్థులు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాముల స్వామి, పిఎసిఎస్ డైరెక్టర్ ఆవునూరి సతీష్ చందర్ రావు, స్థానిక నాయకులు గుండం నర్సయ్య, సొల్ల క్రాంతి కుమార్, వేణు, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## వేములవాడ రాజన్న హుండీ లెక్కింపు ఆదాయం కోటి తొంబై ఏడు లక్షలు

**ప్రజాపక్షం/ వేములవాడ:** ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందిన వేములవాడ రాజన్న ఆలయంలో నిర్వహించిన హుండీ లెక్కింపులో ఆలయానికి 34 రోజులకు ఒక కోటి 97 లక్షల 54 వేల రూపాయలు ఆదాయం సమకూరింది. భక్తుల విరాళాలతో భర్తీ అయిన హుండీని లెక్కించారు. హుండీ లెక్కింపులో మిశ్రమ బంగారం 170 గ్రాములు, మిశ్రమ వెండి 10 కిలోల 300 గ్రాములు లభించాయి.

ఈ లెక్కింపులో కార్యనిర్వహణాధికారి రాధాబాయి, కార్యాలయ పరిశీలకులు సత్యనారాయణ, ఏఇఓలు, పర్యవేక్షకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. భద్రతా ఏర్పాట్లను ఎస్పీఎఫ్ మరియు హోంగార్డు సిబ్బంది పర్యవేక్షించారు. శ్రీ రాజరాజేశ్వర సేవా సమితి సభ్యులు హుండీ లెక్కింపులో పాల్గొన్నారు.

## క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు

**ప్రజాపక్షం/వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలోని గౌతమ్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపారు. గురువారం నాంపల్లిలో ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో పాల్గొని అద్భుత ప్రదర్శన కనబరిచారు. అనంతరం నిర్వాహకులు సెమీఫైనల్ కి చేరిన విద్యార్థులను సర్టిఫికెట్లు అందజేసి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బూర ఉమా రమేష్ మాట్లాడుతూ విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి పెంపొందించడానికి ఇలాంటి పోటీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని, పుస్తకాలతో పాటు క్రీడల్లో కూడా ముందుండేలా మా పాఠశాల ఎల్లప్పుడూ ప్రోత్సహిస్తుందన్నారు. అలాగే రానున్న రోజులలో జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శిక్షణా శిబిరాలు కూడా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల పి.ఇ.టి సంతోష్, ప్రిన్సిపల్ హరికిషన్, డైరెక్టర్ బూర శివ సాయి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ సిఎం రేఖ గుప్తపై దాడిని ఖండించిన భారత్ సురక్ష సమితి నాయకులు

**ప్రజాపక్షం/జగిత్యాల:** నిన్నటి రోజున ఢిల్లీలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో సీఎం రేఖ గుప్తపై ఆగాంతకుడు దాడిని చేయడానికి తీవ్రంగా ఖండిస్తున్నామని భారత్ సురక్ష సమితి నాయకులు అన్నారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని భారత్ సురక్ష సమితి కార్యాలయంలో గురువారం విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు.

ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఏసిఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథన్, చిట్ల గంగాధర్ మాట్లాడుతూ కుక్కలను షెల్టర్ హోమ్‌కు తరలించాలని కోర్టు తీర్పు ఇచ్చిన దానికి నిరసనగా ఢిల్లీ సీఎంపై భౌతాక దాడికి పాల్పడ్డారని, మతిస్థిమితం లేని కారణంగా ఈ దాడికి పాల్పడ్డా మంటూ నిందితుడిని వెనుకేసుకునే ప్రయత్నం చేస్తున్నారని కుహనా సెక్యులర్ వాదులు కొంతమంది ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని అస్థిరపరచడానికి ఇలా చే యడం సరి కాదని, వెంటనే దాడి చేసిన వారిపై కఠినంగా శిక్షించాలని ఇలాంటివి పునరావృత్తం కాకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం అలాంటి వారిపై కఠినంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎడమల వెంకట్‌రెడ్డి, వేముల దేవరాజ్, కొత్తకొండ బలన్నా, గాదసు భూమన్నా, వీరన్న తదితరులు పాల్గొన్నారు

# వినాయక చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

### ఎసిపి రవికుమార్




**ప్రజాపక్షం/మందమర్రి :**రానున్న వినాయక చవితి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో, మత సామరస్యంతో విజయవంతంగా జరుపుకోవాలని బెల్లంపల్లి ఎసిపి రవికుమార్ పిలుపునిచ్చారు. గురువారం మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హిందూ ఉత్సవ కమిటి సభ్యులు, వివిధ మత పెద్దతు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా ఎసిపి రవికుమార్ హాజరై మాట్లాడారు. పండుగలు మత సంస్కృతి, ఐక్యతకు ప్రతీకలని, వాటిని సహోదర భావంతో జరుపుకోవాలని కోరారు. ఉత్సవ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ శాఖ పటిష్టమైన నిఘా ఏర్పాటు చేస్తుందని తెలిపారు. మండలపాల నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసు ముందస్తు అనుమతి తీసుకోవాలని, ప్రతీ మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం తప్పనిసరి అని స్పష్టం చేశారు. గణేష్ నవరాత్రులలో డీజే సిస్టమ్‌లకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని అన్నారు. అనంతరం సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ విగ్రహాల నిమజ్జనం సమయంలో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే ప్రణాకిలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉత్సవాలు ప్రశాంతంగా విజయవంతంగా ముగిసేలా అందరూ సహకరించాలరి ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రాజశేఖర్, అదనపు ఎస్ఐ శ్రీనిఆవస్, పోలీసు సిబ్బంది, హిందూ ఉత్సవ కమిటి సభ్యులు, వివిధ మతాలకు చెందిన మత పెద్దలు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :**ఎస్ఎంఎఎం పథకంలో భాగంగా రైతుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు వ్యవసాయ విస్తరణ అధికారి గౌషియా బేగం పేర్కొన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ఎంఎఎం పథకంలో భాగంగా మండలానికి చెందిన రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు 177, పవర్ స్ప్రేయర్లు 31, రోటవేటర్ 12, సీడ్కం ఫర్టిలైజర్ డ్రిల్ 2, కల్టివేటర్ 12, పవర్ వీడర్ 1, బ్రస్ కట్టర్ 2, పవర్ టిల్లర్ 2 మంజూరయ్యాయని వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మండలంలోని చేడువాయి రైతుల వేదికలో రైతుల నుండి దరఖాస్తు ఫారాలను తీసుకున్నారు.

## బిఆర్ఎస్ పార్టీలో బిజెపి సీనియర్ నాయకులు చేరిక



**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** సిర్పూర్ నియోజకవర్గంలోని భాజపా నాయకులు పలువురు బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు (బిజెపి) పై అసంతృప్తితో ఆ పార్టీకి రాజీనామా చేసి బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు వారు ప్రకటించిన విషయం తెలిసిందే. గురువారం హైదరాబాద్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్,బిఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సమక్షంలో గులాబి కండువా కప్పుకున్నారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి కొంగ సత్యనారాయణ, రాష్ట్ర ఓబిసి మోర్చా కోఆర్డినేటర్ గోలెం వెంకటేష్‌తో పాటు పలువురు నాయకులు పార్టీ గులాబీ కండువా కప్పుకున్న వారిలో ఉన్నారు. ఎమ్మెల్యే హరీష్‌బాబు వైఖరి వల్లే తాము బిజెపిని వీడినట్లు వారు వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపుకు కృషి చేస్తామని అన్నారు.

# నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:**జిల్లావ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలకు నీటి ప్రవాహంతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని సిపిఎం కమిటి నాయకులు డిమాండ్ చేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రేకు సిపిఎం కమిటి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు మాట్లాడుతూ వాంకిడి మండలం జైత్‌పూర్ బోర్డ గ్రామంలో అడా ప్రాజెక్టు నీటి ప్రవాహంతో సుమారు 10 మంది రైతులకు సంబంధించి 30 ఎకరాల పంట నష్టం జరిగిందని ఆరోపించారు. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ప్రాజెక్టు 7 గేట్లు ఎత్తడంతో వాగు ద్వారా పత్తి చేనులోకి నీళ్లు వెళ్లడంతో పంట మొత్తం నీటిలో మునిగి రైతులకి నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు నష్టపోయిన పంటకు ఎకరాకు రూ. 50 వేలు రూపాయలు నష్టపరిహారం ఇవ్వాలని కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వ్యవసాయ అధికారులను పంపించి నీట మునిగిని పంటచేళ్లను పరిశీలించి నష్టపోయిన వారికి పరిహారం అందించేలా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం దినకర్, సిపిఎం పార్టీ జిల్లా కమిటి సభ్యులు గొడిసెల కార్తిక్, గెడెం టికానంద్ పాల్గొన్నారు.



## 55వ వార్షిక రక్షణ బహుమతులు ప్రదానోత్సవం



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్:**ఏరియాలోని జనరల్ మేనేజర్ కార్యాలయంలో ఈనెల 30వ తేదీన నిర్వహించబోయే 55వ వార్షిక రక్షణ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి సంబంధించిన సమీక్షా సమావేశం అధికారులతో జిఎం ఎం. శ్రీనివాస్ నిర్వహించారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ వేడుకలు అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకొని ప్రతీ ఒక్క విభాగ అధిపతులు వారికి కేటాయించిన పనులను ప్రణాళిక బద్ధంగా పూర్తి చేసి వేడుకలను దిగ్విజయం చేయాలని కోరారు. వేడుకలలో సింగరేణి స్ఫూర్తి ప్రస్ఫుటంగా కడపడాలని, దానికి కావలసిన అన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జిఎం ఎన్ సత్యనారాయణ, ఏజీఎం ఫైనాన్స్ భీభత్స, ఏరియా ఇంజనీర్ సాంబశివ రావు, ఉపరితల గనుల ప్రాజెక్టు ఆఫీసర్లు ఏవీ రెడ్డి, చిన్న వెంకటేశ్వర్లు, ఏజెంట్లు కుర్మ రాజేందర్, జి. రవి కుమార్, ఏరియా రక్షణాధికారి విజయ్‌కుమార్, డీజీఎంలు రాజన్న, ఆనంద్‌కుమార్, రవీందర్, రాజేశ్వర్, ఫారెస్ట్ హరి నారాయణ, డివైఎస్ డాక్టర్ పి. రమేష్ బాబు, సీనియర్ పిఓ పి కాంతారావు పాల్గొన్నారు.


## వినాయక మంటపాల ఏర్పాట్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు



**ప్రజాపక్షం/ తాండూర్ :**వినాయక చవితి పండుగ సందర్భంగా ప్రతీ వినాయక మండపం నిర్వాహకులు ఆన్లైన్‌లో దరఖాస్తు చేసుకుని అప్లై చేసిన తర్వాత సంబంధిత పోలీస్ స్టేషన్‌కు దరఖాస్తు కాపిని కచ్చితంగా సమర్పించాలని సిఐ దేవయ్య తెలిపారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో గురువారం గణేష్ మండలపాల నిర్వామకులతో సిఐ దేవయ్య, ఎస్ఐ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో శాంతి కమిటి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ వినాయచ కవితి పండుగను అందరూ ప్రశాంతంగా జరుపుకోవాలని ఎలాంటి అల్లర్లకు తావివ్వకుండా భక్తిశ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలని అన్నారు. మండపాల వద్ద ఎలాంటి అసాంఘీక కార్యక్రమాలకు పాల్పడవద్దని అన్నారు. 24 గంటలు పోలీస్ సహాయం కోసం తక్షణ సహాయ అవసరమైనప్పుడు 100కి డయల్ చేయాలని అన్నారు. పై సూచనలకు ప్రతీ మండపం నిర్వాహకులు కచ్చితంగా పాటించాలని సిఐ అన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ శ్రీనివాస్, విద్యుత్ శాఖ ఏఈ జాన్, హిందూ ఉత్సవ కమిటి సభ్యులు, ముస్లీం మత పెద్దతలు, మండలపాల నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎల్లూర్‌లో విషాదం..

### పాముకాటుతో బాలుడు మృతి



**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :**పాము కాటుతో బాలుడు మృతిచెందిన ఘటన పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన జగదీష్ సులోచన దంపతుల మూడవ కుమారుడు నవదీప్(11) బుధవారం రాత్రి నిద్రిస్తున్న సమయంలో పాటు కాటు వేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటా హుటిన కాగజ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం మంచిర్యాల తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యంలో పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కూలీ పని చేసుకుని జీవనం సాగించేవారు. అల్లారుముద్దుగా పెంచుకున్న బిడ్డ కండ్ల ముందే కానరాని లోకానికి వెళ్లడంతో కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



**ప్రజాపక్షం/జన్నారం :**జన్నారం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలను గురువారం ఐటిడిఏ పీఓ కుష్బూ గుప్తా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని , వ్యక్తిగత పరిశుభ్రంతతో పాటు పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉచుకోవాలని సూచించారు. విద్యార్థులకు మోనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో గణేష్, నవరాత్రి ఉత్సవాలు



**ప్రజాపక్షం/శ్రీరాంపూర్ :**గణేష్ మండప నిర్వాహకులు ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాలను జరుపుకోవాలని ఎస్ఐ మేకల సంతోష్ అన్నారు. గురువారం ఏరియాలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినాయక విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకుంటూ ఆన్లైన్లో సంబంధిత సమాచారం అందిస్తూ నియమ నిబంధనలను పాటించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు ఉత్సవ కమిటి సభ్యులు మట్టి వినాయక విగ్రహాల ప్రతిష్టాపనకు ప్రాధాన్యతను కేటాయించాలని అన్నారు. ఎలాంటి అత్యవసర పరిస్థితుల్లోనైనా కమిషనరేట్ పోలీస్ యంత్రంగాం అందుబాటులో ఉంటుందని, 100 డయల్‌ను సంప్రదించాలని తెలిపారు. మండప పరిసర ప్రాంతాల్లో అవాంఛనీయ సంఘటనలకు తావివ్వకుండా వేడుకలను జరుపుకోవాలని కమిటి సభ్యులకు సూచించారు. గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

# వృద్ధులకు గౌరవం.. ఆదరణ ముఖ్యం

### తహసీల్దార్ దత్తాత్రి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** జాతీయ సీనియర్ సిటిజెన్ దినోత్సవం కేవలం ఒకరోజు వేడుక మాత్రమే కాదని, అది మన పెద్దల పట్ల మనకున్న బాధ్యతను, కృతజ్ఞతను గుర్తు చేస్తుందని ముఖ్యంగా వృద్ధులకు గౌరవం ఆదరణ ముఖ్యమని ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి పేర్కొన్నారు. గురువారం ఎడపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో జాతీయ సీనియర్ సిటిజెన్ దినోత్సవంను మండల సీనియర్ సిటిజన్‌లు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎడపల్లి తహసీల్దార్ దత్తాత్రి ముఖ్య అతిథిగా హాజరై పలువురు సీనియర్ సిటిజన్‌లను శాలువాలతో, మెమోంటోలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో సీనియర్ సిటిజన్ల పాత్ర ఎంతో గొప్పదని, వారి అనుభవాలు, మార్గదర్శకత్వమే మన భవిష్యత్తుకు పునాది అని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి గౌరవించడం మనందరి కర్తవ్యమని అన్నారు. వారి ఆరోగ్యాన్ని ఆర్థిక అవసరాలను తీర్చడం, వారికి సురక్షితమైన, గౌరవప్రదమైన జీవితాన్ని అందించడం మనందరి బాధ్యత అన్నారు. మన కుటుంబాలలో ఉన్న పెద్దలను గౌరవించి, వారిని ప్రేమతో పలకరించడం వారితో సమయం గడపడం ఎంతో ముఖ్యమన్నారు. అనంతరం ఎడపల్లి మండల సీనియర్ సిటిజన్ ఫోరం అధ్యక్షుడు పోలా మల్కారెడ్డి మాట్లాడుతూ.. ఎడపల్లి మండలంలోని సీనియర్ సిటిజన్‌లకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తమ ఫోరం ముందుంటుందన్నారు. వారికి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకవస్తే ఫోరం సభ్యుల ఆధ్వర్యంలో వారి కుటుంబ సభ్యులతో చర్చించి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. సినియర్ సిటిజన్ వారసులు స్థిర, చర ఆస్తులను బలవంతంగా మార్పిడిలు జరిగినా, జీవనోపాధికి ఇబ్బందులు కలిగించిన మండల, డివిజన్, జిల్లా స్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో పాటు వారికి కౌన్సిలింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి రాజలింగం, కోశాధికారి వెంకట్ రెడ్డి, సన్మాన గ్రహీతలు హన్మంత్ రావు, శ్యామ్ లాల్, లక్ష్మి నారాయణ గౌడ్, కొప్పుల గంగారాం, రాధామెర్సి, సభ్యులు కామప్ప, నారాయణ రాజేశం, జహీరొద్దీన్, పండరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి నవదీప్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ



**ప్రజాపక్షం/ పెంచికలపేట్ :** పెంచికల్‌పేట్ మండలంలోని ఎల్లూరు గ్రామానికి చెందిన గిరిజన నిరుపేద విద్యార్థి కొడప నవదీప్ (11) రాత్రి పాముకాటుతో మృతిచెందాడు. గురువారం కోనేరు యువకుల ద్వారా విషయం తెలుసుకున్న సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప విద్యార్థి పార్థివ దేహానికి నివాళులర్పించి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపి అంతక్రియలకు నగదు ఐదు వేల రూపాయలు అందజేశారు. కుటుంబానిక అండగా ఉంటానని అన్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్‌లు దుర్గం రాజన్న, జాజిమొగ్గ శ్రీనివాస్, ఉపాసి సంజీవ్, నాయకులు చౌదరి తిరుపతి సయ్యద్ సాజీద్, నగ్నూరి శ్రీనివాస్, ఖలీల్ బేగ్, యువకులు, తదితరులు ఉన్నారు.

## పల్లె వాకిడి సిడి ఆవిష్కరణ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** పల్లె వాకిడి ఆడియో ఆవిష్కరణ కార్యక్రమం ధర్పల్లి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. పాటను ధర్పల్లి సాయికుమార్ రచించగా సాయి లావోల గానం చేశారు. ఈ కార్యక్రమానికి నలుమూలాల నుండి కవులు, కళాకారులు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో ప్రసాద్, మల్లిక్‌తేజ్, దేవయ్య, ప్రసాద్, రమేష్, సాయి, గంగాధర్, బాలు, సాయి, నరేందర్, రాజ్‌పాల్, రాజు,క్రాంతి,దివ్య,కర్కరమేష్,ప్రశాంత్‌పాల్గొన్నారు.

## వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి 31లోగా దరఖాస్తులు

### ఎఓ సిద్దిరామేశ్వర్



**ప్రజాపక్షం/ఎడపల్లి:**తెలంగాణ ప్రభుత్వం 2025–26ఆర్థిక సంవత్సరానికి గాను రైతుల కోసం ప్రవేశ పెట్టిన వ్యవసాయ యాంత్రీకరణ పథకానికి దరఖాస్తుల స్వీకరణ ఈ నెల ఆగస్టు 31వ తేది వరకు జరుగుతుందని ఎడపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి సిద్దిరామేశ్వర్ తెలిపారు. ఈ పథకం కింద చిన్న, సన్నకారు రైతులు, మహిళా రైతులు, ఎస్సీ, ఎస్టీ మహిళా రైతులకు ప్రత్యేక రాయితీలు ఇవ్వబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ పంటల దిగుబడిని పెంచుకునేందుకు, సాగు పనులను సులభతరం చేసుకునేందుకు వీలుగా ఈ పథకం ద్వారా ప్రభుత్వం వివిధ వ్యవసాయ పనిముట్లపై 40నుంచి 50శాతం రాయితీని అందిస్తుందని, ఇందులో భాగంగా, నియోజకవర్గానికి 14రకాల యంత్ర పరికరాలను కేటాయించారన్నారు. ఇందులో చేతి పంపులు, పవర్ స్ప్రేయర్లు, రోటో వేటర్లు, పవర్ టిల్లర్లు, పవర్ వీడర్లు, బ్రష్ కట్టర్లు, ట్రాక్టర్‌తో నడిచే దుక్కిదున్ను పనులు, గడ్డి చుట్టే యంత్రాలు, విత్తనాలు చల్లే యంత్రాలు వంటివి ఉన్నాయని, రైతులు ఈ పథకం కింద రాయితీ పొందడానికి, అవసరమైన పత్రాలతో కూడిన దరఖాస్తు ఫారాన్ని నింపి, తమ సంబంధిత రైతు వేదికలో అందచేయాలని సూచించారు. దరఖాస్తుతో పాటు పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు, దరఖాస్తు ఫారం, పాస్‌ఫోర్ట్ సైజ్ ఫోటో తదితర పత్రాలు తప్పనిసరి అన్నారు. రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎవో సిద్దిరామేశ్వర్ కోరారు. మరింత సమాచారం కోసం రైతులు తమ గ్రామ రైతు వేదికలోని వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు.

## పదిరూపాయల ఆఫర్‌తో కిక్కిరిసిన జనం



**ప్రజాపక్షం / ఆర్మూర్ :**పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలోగల విఆర్ కాంప్లెక్సులో మన ఫంకీ బాయ్స్ అడ్డా షాపులో 10 రూపాయలకు షర్ట్, 10 రూపాయలకు ప్యాంటు అని సోషల్ మీడియాలో షాపు యజమాని ప్రచారం చేయడంతో గురువారం ఉదయం నుండే వేల సంఖ్యలో యువకులు షాపు వద్ద చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో జనం షాపు వద్ద చేరుకోవడంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా సిఐ సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో పోలీసులు బారీ ఎత్తున షాప్ వద్ద చేరుకొని ప్రజల్ని చెదరగొట్టారు. షాపును సీజ్‌చేసి షాపు యజమానులను పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ మాట్లాడుతూ ఎటువంటి అనుమతులు లేకుండా సోషల్ మీడియాలో ప్రచారం నిర్వహించి ప్రజలను ఇబ్బంది పెట్టేవిదంగా ట్రాఫిక్ సమస్యతలెత్తే విధంగా చేసినందుకుగాను షాపు యజమానులపై కేసు నమోదు చేయడం జరిగిందని, ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా వ్యాపారస్తులు సహకరించాలని ఆయన కోరారు.

## గ్రామాభివృద్ధి కమిటీ భవనంపై పూర్తి విచారణ చేసి వెల్లడిస్తాం

**ప్రజాపక్షం/జక్రాన్‌పల్లి :**మండల కేంద్రంలో నిర్మించిన గ్రామాభివృద్ధి కమిటీ ఆధీనంలోని మడిగెల కిరాయిలు గ్రామాభివృద్ధి కమిటీకి చెల్లిస్తున్నామని కిరాయిదారులు వెల్లడించారు. గ్రామ కార్యదర్శిని వివరణ కోరగా వీడీసీ గ్రామపంచాయతీకి ట్యాక్స్‌లు చెల్లిస్తున్నారని భవనం 960/1,9, 960/2, 960/3 అయితే దీనిపై పూర్తి వివరాలు తెలియవని తెలిపారు. అలాగే ఎమ్మార్వోని సంప్రదించి వీడీసీ భవనంపై వివరాలు అడగగా భూమి ఎవరి పేరు మీద ఉంది లేక ప్రభుత్వ ం భూమి అనే దానిపై విచారణ చేసి పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఎమ్మార్వో తెలిపారు.

కా నీ గ్రామస్తులు కొందరు వీడీసీ భవనం నిర్మించుకోవడానికి ప్రభుత్వం తమకు ఇచ్చిన భూమిని అంటున్నారు గ్రామస్తు ల నుండి డబ్బులు విరాలంగా సేకరించి కొంత డబ్బు ప్ర భుత్వం నుండి నిర్మించుకున్నామని గ్రామస్తులు తెలిపారు.

## పండుగను శాంతియుతంగా జరుపుకోవాలి



**ప్రజాపక్షం/బోధన్:**వినాయక చవితి పండుగను ప్రశా వాతావరణంలో శాంతియుతంగా జరుపుకోవాలని బోధన్ ఎసిపి శ్రీనివాస్ అన్నారు. బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి కళ్యాణ మండపంలో గురువారం పట్టణ సిఐ వెంకట నారాయణ ఆధ్వర్యంలో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిపి శ్రీనివాస్ హజరై మాట్లాడారు. రాబోయే వినాయక చవితి ఉత్సవం సందర్భంగా వినాయక మండపాలు ఏర్పాటు చేసే నిర్వహకులు తప్పనిసరిగా ఆన్‌లైన్ నమోదు చేయాలని సూచించారు. మండపాల దగ్గర విద్యుత్ ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వినాయక మండపాల దగ్గర డీజేలు నిషేదించడం జరిగిందని, ఎవరైనా డిజేలు పెడితే వాటిని సీజ్ చేయడం జరుగుతుందని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

### నరసింహ్మా స్వామి ఆలయంలో

## అమావాస్య శనివారం ఏర్పాట్లు పూర్తి



**ప్రజాపక్షం/ఎడపల్లి:** శనివారం అమావాస్య పురస్కరించుకొని జిల్లా నలుమూలల నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల నుంచి విచ్చేయనున్న భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు ఆలయ ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారి వేణు తెలిపారు. ఎడపల్లి మండలం జాన్కంపేట్ గ్రామ శివారులో గల శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో ఈ నెల 23న శనివారం అమావాస్య పురస్కరించుకొని అష్టముఖి కొనేరులో భక్తులు పుణ్య స్నానాలు ఆచరించి స్వామి వారిని దర్శించుకుంటారు. దక్షణ భారతదేశంలోనే ప్రసిద్ధి గాంచిన అష్టముఖి కొనేరులో భక్తులు తరలివచ్చి పుణ్యస్నానాలు ఆచరించి నరసింహ స్వామిని దర్శించుకుంటే భక్తుల సకల పాపాలు హరించబడతాయని ఆలయ ఈఓ సూచిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లను చేస్తున్నారు. ఆలయానికి విచ్చేయు భక్తులకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేస్తున్నట్లు దర్శనానికి విచ్చేసే భక్తులు అష్టముఖీ కొనేరులో స్నానాలు ఆచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకొని దర్శనానికి క్యూలైన్లను పాటించాలన్నారు. ఎడపల్లి ఎస్ఐ రమ గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

## శోభాయాత్రకు అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఏర్పాట్లు

**ప్రజాపక్షం/నిజామాబాద్:**వినాయక శోభాయాత్రకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాటు చేయాలని ప్రభుత్వ సలహాదారు మహ్మద్ షబ్బీర్అలీ అన్నారు. గురువారం నగరంలోని వినాయక శోభాయాత్ర రూట్ మ్యాప్‌ను పరిశీలించి మాట్లాడారు. విద్యుత్ ఆయన వెంట మున్సిపల్ అధికారులు ఉన్నారు.

## 24న జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ మీట్

**ప్రజాపక్షం/మహబూబాబాద్:**ఈనెల 24న మ హబూబాబాద్ జిల్లా జూనియర్ అథెంటిక్స్ మేటర్ నిర్వహిస్తున్నట్టు జిల్లా అసోసియేషన్ సెక్రెటరీ భాష నాగమణి తెలిపారు. ఇందులో ఎంపికైన అత్లెట్స్ 11వ తెలంగాణ స్టేట్ జూనియర్స్ మహబూబ్‌నగర్ పాలమూరు యూనివర్సిటీలో జరిగే అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో 24న ఆదివారం జరిగే సెలక్షన్స్ లో బాలబాలికరు వారి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకురావాల్సిందిగా తెలిపారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో సెలక్షన్స్ నిర్వహిస్తున్నట్లు నాగమణి తెలిపారు.




## అనైలైన్ డిజిటల్ బ్యాంకు లావాదేవీలపై అవగాహన సదస్సు

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థి దశ నుంచి డిజిటల్ ఆర్థిక లావాదేవీలపైన అవగాహన కల్పించే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం రోజున స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సత్యజిత్ గోష్ బృందం విద్యార్థులకు బ్యాంక్ ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించిన ఆర్‌టిజిఎస్, యుపిఐ, ఆధార్ ఆధారిత లావాదేవీలు, డెబిట్ కార్డు, క్రెడిట్ కార్డు మొదలై వాటికి సంబంధించిన కనిష్ట, గరిష్ఠ లావాదేవీల గురించి వాటిని ఎలా ఉపయోగించాలి, మొబైల్ బ్యాంకింగ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ వితౌట్ ఇంటర్నెట్‌తో కూడ ఆర్థిక లావాదేవీలు నిర్వహించే అవకాశాన్ని ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు గురించి మాట్లాడుతూ అపరిచిత వ్యక్తులు ఎటిఎం పిన్ నెంబర్ గాని, యుపిఐ పిన్ నెంబర్ గాని ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్‌వర్డ్ కోసం మీకు ఫోన్ చేసి మేము బ్యాంకు ఉద్యోగులం అని నమ్మకం కలిగే విధంగా మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ద్వారా మీ యొక్క సమాచారాన్ని అందించకూడదు. మీ సంబంధిత బ్రాంచికి వెళ్లి మాత్రమే మీ కెవైసిని పూర్తిచేసుకోవాలి. అంతేగాని లింకుని పైన క్లిక్ చేయడం చేయకూడదని సత్యజిత్ గోష్ వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, రిజర్వు బ్యాంకు అధికారి సత్యజిత్ గోష్, నిర్మల్ లిడ్ బాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఇతర బ్యాంకు సిబ్బంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలెపు కృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

## నిర్మల్‌లో గణేష్ విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జన ఉత్సవాలపై పరిశీలన

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ పట్టణంలో గణేష్ విగ్రహ ప్రతిష్టాపన, నిమజ్జన ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకునేలా అన్ని రకాల ఏర్పాట్లు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. గురువారం ఎఎస్పీ రాజేష్ మీనాతో కలిసి ఆయన పట్టణంలోని బుధవార్‌పేట్ నం.01 గణేష్ మండపం నుండి ఓల్డ్ బస్టాండ్, బాగులవాడ చౌక్ (ఎంఎల్ఎ క్యాంపు ఆఫీస్), గుల్జార్ మార్కెట్, గాంధీ చౌక్ మార్గంగా బంగల్‌పేట్ చెరువు నిమజ్జన ప్రదేశాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల సమయంలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. నిమజ్జన ప్రదేశంలో శానిటేషన్ లైటింగ్ తాగునీటి సౌకర్యాలు, భద్రతా చర్యలు పటిష్టంగా చేపట్టాలని సూచించారు. పోలీసు, మున్సిపల్, విద్యుత్, ఆరోగ్య విభాగాలు సమన్వయంతో ప్రత్యేక బృందాలను నియమించాలన్నారు. ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉంటాయని, ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించి, సహకరించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రత్నకల్యాణి, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, తహసీల్దార్ రాజు, రెవెన్యూ, పోలీస్, విద్యుత్, మున్సిపల్ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



# రోడ్ల విస్తరణకు నిధులు కేటాయించండి

### రోడ్డు భవనాల శాఖ మంత్రికి వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే బొజ్జు పటేల్



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గంలో రోడ్ల బలోపేతం కాదు, విస్తరణ అభివృద్ధికి అధిక నిధులు ఇవ్వండి అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, ఖానాపూర్ నియోజకవర్గంలో రోడ్ల స్ట్రెంతెనింగ్ (బలోపేతం) కోసం కాకుండా రోడ్ల విస్తరణ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలని రోడ్డు,భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్. ఖానాపూర్ నుండి బెల్లాల్, అదేవిధంగా ఖానాపూర్ నుండి తర్లపాడు, ఉట్నూర్ నుండి గుడిహత్నూర్, ఉట్నూర్ నుండి హస్నాపూర్, నార్నూర్ చౌరస్తా, కలమడుగు నుండి జన్నారం, జన్నారం నుండి కావ్వాల్ రోడ్లను విస్తరణ చేయాలని వినతిపత్రం ఇచ్చి తెలియజేశారు. దీనికి మంత్రి స్పందించి ప్రిన్సిపాల్ సెక్రటరీ వికాస్‌రాజ్‌తో ఈ ప్రతిపాదనలను హ్యామ్ ప్రాజెక్ట్‌లో పెట్టాలని ఆదేశించారు. ఈ రోడ్లు అన్ని హ్యామ్ ప్రాజెక్ట్‌లో స్ట్రెంతెనింగ్ (బలోపేతం) చేయాలని మంజూరుచేశారు. కానీ వెడల్పు చేయాలని నిర్ణయం తీసుకోలేదు. అందుకని ఆ రోడ్లను బలోపేతం కాకుండా వెడల్పు చెయ్యాలని కోరడం జరిగింది. ఇట్టి రోడ్లలో అనునిత్యం అధిక వాహనాలతో పాటు ప్రజలతో రద్దీగా ఉంటుందని తెలిపారు. ఈ రోడ్ల వెంబడి ప్రజలు కాలినడకన వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు.

ఇటువంటి రోడ్లను విస్తరించాలని ఆయా గ్రామస్తులు పలుమార్లు తన దృష్టికి తీసుకొచ్చారని అన్నారు. రోడ్లను వెడల్పు చేయడం అనివార్యమని అన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు వెంటనే రోడ్డు వెడల్పు చేసేందుకు అనుమతులు ఇవ్వాలని మంత్రికి తెలియజేశారు.

# పేదల ఇండ్ల స్థలాల అక్రమ పట్టా రద్దుచేయాలి

### బైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా




**ప్రజాపక్షం/బైంసా :** బైంసా మండలం హంపోలి గ్రామంలో పేదల ఇండ్ల స్థలాలను అక్రమంగా చేసిన పట్టాను రద్దు చేయాలని, అదే స్థలంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని సిపిఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి జె.రాజు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బైంసా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా జె.రాజు మాట్లాడుతూ 1983లో వరదల కారణంగా 16/ఆ,16/ఈ, సర్వే నెంబర్‌లోని ఐదు ఎకరాల పట్టా భూమిని కొని ఎస్సీ, ఎస్టీలకు ఇండ్లు నిర్మించి ఇవ్వడం జరిగింది. ఆ భూమిలోని ఇండ్లను కూలగొట్టి అక్రమంగా పట్టా చేసుకోవడం జరిగింది. ఈ అక్రమ పట్టాను రద్దు చేయాలని తహసీల్దార్,ఆర్డిఓలుపై అధికారులకు నివేదికలు పంపిన ఇప్పటికీ రద్దు కాలేదని తెలిపారు. ఈ అక్రమ పట్టా చేసిన అప్పటి తహసీల్దార్ పైన చర్యలు తీసుకోవాలని,అక్రమ పట్టాను రద్దు చేయాలని,రద్దు చేసే వరకు సర్వే నెంబర్ 16/ఆ,16/ఈలను నిషేధిత భూముల జాబితాలో పెట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పిఒడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.హరిత గ్రామస్తులు విట్టల్ గంగారం, సాయినాథ్, సురేష్ బాబు ఎల్లన్న, భోజన్న, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

## మామడ డిజె యూనియన్ నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**ప్రజాపక్షం/మామడ :** మామడ మండల డిజె యూనియన్ నూతన కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కోడిచెర్ల లింగన్న,అధ్యక్షుడిగా కల్లెడ నరేశ్, ఉపాధ్యక్షుడిగా పల్లికొండ అర్జున్, కార్యదర్శిగా బట్టు ప్రసాద్, కోశాధికారిగా తోకల శివ కుమార్లను ఏన్నుకున్నారు.సలహాదారులుగా కత్తి శివ మణి, ఏనుగందుల గణేష్‌ను ఎంపిక చేశారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను యూనియన్ సభ్యులు సన్మానించారు.

# టియుడబ్ల్యూజె జాతీయ కమిటీ సభ్యుడిగా గాండ్ల రాజశేఖర్

### 25న జిల్లా వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయం ముందు 29న కలెక్టరేట్ ఎదుట జర్నలిస్టుల ఆందోళన



**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** నిర్మల్ జిల్లాలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్య మరోసారి తెరపైకి వచ్చింది. తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యూజె) జిల్లా కమిటీ ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ సమస్య పరిష్కారం కోసం రెండు దశల ఆందోళన కార్యక్రమాలను చేపట్టాలని నిర్ణయించిందని జిల్లా అధ్యక్షుడు కొండూరు రవీందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య తెలిపారు. ఈ సమావేశానికి జిల్లా కమిటీ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గాండ్ల రాజశేఖర్‌ను జాతీయ కమిటీ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కొండూరు రవీందర్, ప్రధాన కార్యదర్శి వెంకగారి భూమయ్య మాట్లాడుతూ జర్నలిస్టులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఇంటి స్థలాల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని ప్రస్తావించారు. రాష్ట్రంలో అనేక చోట్ల జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించినప్పటికీ, నిర్మల్ జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియలో పురోగతి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరించడానికి మొదటి దశగా ఈనెల 25వ తేదీన మండల స్థాయిలో నిరసన చేపట్టాలని నిర్ణయించారు.

జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు దాసరి వేణుగోపాల్, గుమ్ముల అశోక్,పూసల పోశెట్టి, రాచమల్ల రాజశేఖర్,టి.రవీందర్,జిల్లా సంయుక్త కార్యదర్శి జల్దా మనోజ్, సట్ల హనుమన్లు, ప్రచార కార్యదర్శి రాజేశ్వర్,జిల్లా కార్యవర్గ సభ్యులు షిండే మహేష్, కొల్లి రాజేశ్వర్, డిఎస్ మధు పలువురు జర్నలిస్టు నాయకులు పాల్గొన్నారు.

# పబ్జీ గేమ్‌కు బానిసగా మారి విద్యార్థి మృతి



**ప్రజాపక్షం/బైంసా :** బైంసా పట్టణంలో పబ్జీ గేమ్‌కు బానిసగా మారిన విద్యార్థి ప్రాణం తీసుకున్న విషాదకర ఘటన బుధవారం నిర్మల్ జిల్లా బైంసా పట్టణంలోని అనందనగర్ కాలనీలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబీకులు,పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని మౌలాలి, ప్రాంతానికి చెందిన బేతి సంతోష్,సాయిప్రజ దంపతులు గత కొంత కాలంగా బైంసాలోని ఆనందనగర్ కాలనీ పరిధిలో నివాసముంటూ వ్యాపారం నిర్వహిస్తున్నారు. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు బేతి రిశేంద్ర హైదనాబాద్‌లోని భాష్యం స్కూల్లో తొమ్మిదవ తరగతి పూర్తిచేసుకొని పదవ తరగతిలో చేరాల్సిఉంది. అయితే బేతి రిశెంద్ర గత కొంత కాలంగా పబ్జి గేమ్‌కు బానిసగా మారాడు. వేసవి కాలం నుంచి పబ్జిగేమ్ ఆట ఆడటానికే పరిమితమయ్యాడు. ఇదే క్రమంలో చదువుపై నిర్లక్ష్యం చేసి పదవ తరగతి, కోసం పాఠశాలకు వెళ్లకుండా ఇక్కడే ఉండిపోయాడు. తల్లిదండ్రులు ఎన్నివిధాలుగా నచ్చ చెప్పినా చదువుపై ధ్యాసపెట్టకుండా సమయమంతా పబ్జి ఆట ఆడటంలోనే గడిపేవాడు. పబ్జీ ఆటకు బానిసగా మారిన కుమారుడితో మార్పు తెచ్చి చదువుపైదృష్టి పెట్టి దిశగా తల్లిదండ్రులు ఎన్ని ప్రయత్నాలు చేసిన ఫలితం కానరాలేదు. చివరి ప్రయత్నంగా గత రెండు మూడు రోజుల నుంచి కుమారుడికి కుటుంబీకులు పబ్జీగేమ్ ఆడకుండా కట్టడి చేసినట్లుగా తెలిసింది. దీంతో డిప్రెషన్‌కులోనైన సదరు విద్యార్థి మనస్థాపం, ఆవేశం చెంది బుధవారం సాయంత్రం వేళలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బైంసా పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. మృతుదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఇక్కడి ఏరియా ఆసుపత్రికి తరలించారు.



# రైతులకు ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు

### అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్

**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** రైతులకు ఎరువులుల,విత్తనాలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్ తెలిపారు.గురువారం నిర్మల్ రూరల్ మండలం చిట్యాలలోని అభయ కృషి ఎరువులు, విత్తనాల దుకాణాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎరువుల కొరత లేదని, యూరియా, డిఎపి సహా అవసరమైన ఎరువులు సరిపడా స్టాక్‌లో ఉన్నాయని వెల్లడించారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలని సూచించారు. ప్రతి షాపులో ఎరువుల రేటు చార్ట్ తప్పనిసరిగా ప్రదర్శించాలన్నారు. ఎరువుల సరఫరాలో ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ నిరంతరం కొనసాగించాలని అధికారులకు సూచించారు. ఈ పరిశీలనలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, సంబంధిత అధికారులు,రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు టీ షర్ట్‌లు పంపిణీ

**ప్రజాపక్షం/తానూర్ :** మండలంలోని ఎల్వి, గ్రామ జిల్లా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు, ఎల్వి పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న నవనీత, భర్త రాములు, పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఏకరూప టీషర్టులను గురువారం బహుకరించి మండల విద్యాధికారి నరేందర్ చేతుల మీదగా విద్యార్థులకు అందించడం జరిగింది.ఈ సందర్భంగా మండల విద్యాధికారి నేరేందర్ మాట్లాడుతూ..సమాజంలో దాతృతం కలిగిన మనసు కొందరే కలిగి ఉంటారని, ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు తనవంతు సహాయంగా ఏకరూప టీషర్టులు బహుకరించిన రాములుకు పాఠశాల, ఉపాధ్యాయుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధాన ఉపాధ్యాయులు రాజశేఖర్, నవనీత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## హేమాచలం నూతన ఇఒగా మహేష్



ప్రజాపక్షం/మంగపేట:తెలంగాణలో రెండవ యాదగిరిగుట్టగా పిలువబడే ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులో హేమచల గుట్టల్లో స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మి నృసింహస్వామి చెంచు లక్ష్మి ఆది లక్ష్మి ద్వైత అమ్మవార్ల ఆలయానికి నూతన కార్యనిర్వాహణాధికారిగా రేవెల్లి మహేష్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ప్రస్తుతం ఈఓగా ఉన్న శ్రవణం సత్యనారాయణ నుండిబాధ్యతలుస్వీకరించగానూతన ఈఓ గా బాధ్యతలు స్వీకరించిన మహేష్‌కు ఆలయ అర్చకులు రాజశేఖర్ శర్మ, అర్చకులు ఈశ్వర్ చంద్ శర్మ, పవన కుమారాచార్యులు న్యాతని సీతయ్య ఆలయ సిబ్బందికి స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

## అడిషనల్ కలెక్టర్‌కు అభినందన



ప్రజాపక్షం/ములుగు: ములుగు జిల్లా అడిషనల్ కలెక్టర్ మహేందర్ జిని గురువారం ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా అధ్యక్షులు బాదం ప్రవీణ్ ఆధ్వర్యంలో అడిషనల్ కలెక్టర్‌కు పుష్ప గుచ్చం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిఎంసిఎస్ రామ్ పతి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, జిల్లా సీనియర్ రైస్ మిల్లర్లు గోపు వాసుదేవరెడ్డి, మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం అందజేత



ప్రజాపక్షం/మహాదేవపూర్: ఇటీవల అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఒమేగా క్యాన్సర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ ఎంపిటిసి కొయ్యల శంకరయ్య ను గురువారం కాంగ్రెస్ నాయకుడు కట్కం అశోక్ పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేసారు.అనంతరం వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మండల అధ్యక్షుడు పోలు మొండయ్య,మండల అధికార ప్రతినిధి బుర్రి శివరాజ్ ,తదితరులున్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

### మరిపెడ వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి



ప్రజాపక్షం /మరిపెడ : సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మరిపెడ పిహెచ్ సి వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి అన్నారు. గురువారం మరిపెడ మండలం అనేపురం గ్రామంలోని గ్రామ పంచాయతీ లో జన వికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ రవి మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు.వ్యక్తి గత పరిశుభ్రత తో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు.ఇంటి లోపల, బయట పరిసరాలను శుభ్రంగా ఉండేలా చూసుకోవాలన్నారు.పగటి పూట కుట్టే దోమ వల్ల డెంగ్యూ జ్వరం వస్తుందని, ఈ దోమ మంచినీటి నిల్వల్లో వృద్ధి చెందుతుందన్నారు. దోమల నియంత్రణతో వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు.ఇంటి పరిసరాల ప్రాంతాల్లో ఉండే కుండీలు, కూలర్లలో, ఉపయోగం లేని వస్తువుల్లో నీటి నిల్వలను తొలగించాలన్నారు. పరిశుభ్రతను ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు.ప్రస్తుత సమాజంలో చాలా మంది బిజీ అయిపోయి ఆరోగ్యం పట్లశ్రద్ధ చూపడం లేదన్నారు. ఫలితంగా తక్కువ వయసులోనే బీపీ, షుగర్ వంటి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు.నిత్యం వ్యాయమం చేయడం ద్వారా ఆరోగ్యంగాజీవించవచ్చునని హితవు పలికారు. సమతుల్య ఆహారంతీసుకోవాలని సూచించారు. ఆరోగ్య నియమాలను ప్రతిఒక్కరూ పాటించాలని కోరారు.సుమారు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏఎన్ఎంలు కీర్తి, ఎంఎల్ హెచ్ పి సౌజన్య, సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర, కోఆర్డినేటర్స్ జుజ్జూరి ఉపేంద్ర, హెల్త్ అసిస్టెంటెంట్లు నరసయ్య, సొంబయ్య,ఆశా కార్యకర్త పార్వతమ్మ, పుష్ప, భార్గవి, కైక, సునీత, విజయ లక్ష్మి, ధనలక్ష్మి , నసీమా పాల్గొన్నారు.

## నానో యూరియా వాడకంపై అవగాహన ఉండాలి

### జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల



ప్రజాపక్షం/గూడూరు/కొత్తగూడ:నానో యూరియా వాడకంపై అధికారులు డీలర్లు అవగాహన పెంచుకుని రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయ నిర్మల అన్నారు.గురువారం కొత్తగూడ మండలంలోని పోగుళ్ళపల్లి ఊట్ల గ్రామంలోని యూరియా కేంద్రాలను మండల వ్యవసాయశాఖ అధికారి జక్కుల ఉదయతో కలిసి ఆమె తనిఖీ చేశారు.పోగుళ్లపల్లి గ్రామంలో ఉన్న పాక్స్ కేంద్రం వద్ద యూరియా కోసం ఉన్న రైతులకు నానో యూరియా వాడకం గురించి రైతులకు అవగాహన కల్పించారు.జిల్లా ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి విజయ నిర్మల మాట్లాడుతూ 500 యంఎల్ నానో మూరియా బాటిల్ ఒక 45 కిలోల యూరియా బస్తాకి సమానమని పనిచేసే సామర్థ్యం కూడా నానో యూరియాకు ఎక్కువగా ఉంటుందని పేర్కొన్నారు.చాలా సులువుగా చాలా రకాల పురుగుమందులు నానో డీఏపి నానో యూరియా నానో జింక్ తో కలిపి పీచకారి చేసుకోవచ్చని తెలియజేశారు. రైతులు 30 రోజుల తర్వాత నానో యూరియా వాడకోవచ్చని డ్రోన్ల ద్వారా కాని చేతి పంపుల ద్వారా గాని పిచికారి చేసుకోవచ్చన్నారు.ధర కూడా యూరియా బస్తా కంటే తక్కువగానే ఉంటుందన్నారు. ఖర్చు కూడా ఆదా అవుతుందని ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని రైతుల్లో పెద్ద ఎత్తున నానో యూరియా వాడకంపై శ్రద్ధ చూపెలా అవగాహన పెంచాలని డీలర్లకు అధికారులు సిబ్బందికి సూచించారు.ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కుల ఉదయ ఏఈఓలు రాజు అరవింద్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో శానిటేషన్ పనులను వేగవంతం చేయాలి



ప్రజాపక్షం/ తొర్రూరు : తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాల్లో శానిటేషన్ పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. తొర్రూరు పట్టణ కేంద్రంలో ఎంపీడీఓకు వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామాలు, మున్సిపాలిటీ పరిధిలో చెత్తా,చెదారం పేరుకుపోయి దుర్వాసనతో ప్రజలు అనేక ఇబ్బందులతో రోగాల బారిన పడుతున్నారని అన్నారు. సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ గ్రామస్థాయి నుంచి సర్వేలు నిర్వహించి ప్రభుత్వం అవలంభిస్తున్న ద్వంద్వ వైఖరిని విడనాడి ప్రజలకు మెరుగైన పరిపాలనను అందించాలని డిమాండ్ చేశారు. మల్టీపర్పస్ వర్కర్లకు కనీసం జీతాలు కూడా చెల్లించే పరిస్థితి లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరగకపోవడంతో పంచాయతీకి నిధులు లేక కనీసం బ్లీచింగ్ పౌడర్లు, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించే పరిస్థితి లేదన్నారు. మురుగు కాల్వలలో నీరు పేరుకుపోవడంతో తొలగించే పరిస్థితి లేదన్నారు. మండల ప్రత్యేక అధికారులు తక్షణమే స్పందించి గ్రామాలు, మున్సిపాలిటీలో పేరుకుపోయిన చెత్తా, చెదారాన్ని తొలగించి శానిటేషన్ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్)మాస్‌లైన్ డివిజన్ నాయకులు ఉడుగుల రాములు, బంగారి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను నిలిపేయాలి

ప్రజాపక్షం/తొర్రూరు : ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు, మాస్‌లైన్ డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ నెల 24న హనుమకొండలో నిర్వహించే బహిరంగ సభ పోస్టర్లను గురువారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనం ఆవరణలో వామపక్ష పార్టీల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది కాలంగా మధ్య భారత అడవుల్లో భారత ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో హత్యాకాండలను కొనసాగిస్తుందన్నారు. శాంతిచర్చలకు మావోయిస్టు పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని పదే పదే కోరిందని, ఆపరేషన్ కగార్ నిలిపివేయాలని, మావోలతో చర్చలు జరపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఛత్తీస్‌గఢ్ తెలంగాణ రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో నివసిస్తున్న ఆదివాసీ గిరిజనులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని భయానక వాతావరణంలో మగ్గిపోతున్నారని అన్నారు. ఆదివాసీలను అంతం చేసే విధానాన్ని విడనాడాలని కోరారు. ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జిచే న్యాయ విచారణ జరిపించాలన్నారు. సీపీఐ నాయకులు ఓమ బిక్షపతి, వల్లపు సాయిలు, నర్సింహాచారి, నాయకులు ఊడుగుల రాములు, మల్లయ్య, యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

## 24న యోగా పోటీలు

ప్రజాపక్షం/మహబూబాబాద్ :మహబూబాబాద్ జిల్లా యోగ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోవుఆదివారం ఆగస్టు 24 వ తారీకు 2025న జడ్పీహెచ్ఎస్ గర్ల్స్ హై స్కూల్ ఆవరణలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ బాలబాలికలు మరియు జూనియర్ బాల బాలికల యోగా పోటీలు (ట్రెడిషనల్, బ్యాక్ బెండు ఫార్వర్డ్బెండ్ ట్విస్టింగ్ హ్యాండ్ బ్యాలెన్స్ ,లెగ్ బ్యాలెన్స్ , ఆర్టిస్టు) నిర్వహించబడునని అధ్యక్ష , కార్యదర్శి తూణం పుష్పలీల, నరేష్ గారు తెలియజేశారు ఆధార్ కార్డు డేట్ అఫ్ బర్త్ వివరాలతో ఉదయం 8 గంటలకు హాజరు కావాల్సిందిగా తెలిపారు. పాల్గొనేవారు పేరెంట్స్ నుంచి రిస్క్ సర్టిఫికెట నుండి తీసుకు రావాలని, వివరాలకు 8919703008, 9985185287 నెంబర్లకు సంప్రదించాల్సిందిగా వారు తెలిపారు.

## బాధితునికి 'బంజారా యువ చైతన్య' సహాయం

ప్రజాపక్షం/గూడూరు: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రానికి చెందిన వ్యక్తి గృహం కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు కూలిపోవడంతో మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల బంజారా యువ చైతన్య వెల్ఫేర్ అసోసియేషన్ వారు స్పందించి గ్రామపంచాయతీ కార్యదర్శి కి సమాచారం ఇచ్చి బాధితుడు బానోత్ బాల్యాకు తాత్కాలికంగా ఉండేందుకు తాటిపత్రిని అందించారు. ఈసందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు బానోత్ మోహన్ నాయక్ ఆదేశాల మేరకు ఈకార్యక్రమం చేపట్టినట్లు బంజారా యువ చైతన్యం వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు లెతిపారు.కూలిపోయిన గోడ స్థానంలో మళ్లీ గోడ కట్టాలన్న గృహాన్ని సైతం ఆర్థిక సహాయంతో తాత్కాలికంగా తాటి పత్రిని అందించడం జరిగింది. నాయకులు బన్సీలాల్ బాలునాయక్ అఖిల్ వెంకన్నతదితరుల పాల్గొన్నారు.

## బిజెపి జిల్లా ఉపాధ్యక్షునిగా పల్లె కుమార్

ప్రజాపక్షం/తొర్రూరు : పాలకుర్తి నియోజకవర్గం బీజేపీ పార్టీ సంస్థాగతంగా జనగామ జిల్లా కేంద్రంగా పని చేస్తున్న తరుణంలో జిల్లా కార్యవర్గంలో తొర్రూరు పట్టణానికి చెందిన మాజీ మండల అధ్యక్షుడు పల్లె కుమార్‌ను జిల్లా ఉపాధ్యక్షుడిగా జిల్లా అధ్యక్షుడు ఎస్. రమేష్ ప్రకటించారు. తొర్రూరు పట్టణ కేంద్రానికి చెందిన పల్లె కుమార్ 2001 నుండి ఏబీవీపీ కార్యకర్తగా, తొర్రూరు భాగ్ (డివిజన్)కో కన్వీనర్‌గా, కన్వీనర్‌గా, ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా, వరంగల్ జిల్లా కో కన్వీనర్‌గా, ఏబీవీపీ జిల్లా కన్వీనర్‌గా బాధ్యతలు చేపట్టి అనేక విద్యార్థి ఉద్యమాలు నిర్వహించారు. 2014 నుండి బీజేపీ కార్యకర్తగా, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా, 2015 నుండి 2019 వరకు బీజేపీ తొర్రూరు మండల అధ్యక్షులుగా, 2019 నుండి 2025 వరకు బీజేపీ తొర్రూరు మున్సిపాలిటీ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించి పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తున్న క్రమంలో బీజేపీ అధిష్టానం తన సేవలను గుర్తించి జిల్లా ఉపాధ్యక్షుడుగా బాధ్యతలు అప్పగించారు. పల్లె కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు సౌద రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లేగ రాంమోహన్‌రెడ్డి, కేవీఎల్ఎన్‌రెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఆరుట్ల దశమంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.